

కలిసొచ్చిన విలీనం..!

ఎక్సైజ్ పోస్టులకు డిమాండ్

సెబ్ విలీనంతో పెరిగిన పైరవీలు

ఒక్కపోస్టుకు ఐదుగురు పోటీ

ఎమ్మెల్యేల లేఖల కోసం ప్రదక్షిణ



ఎక్సైజ్ పోలీసు స్టేషన్

హిందూపురం, సెప్టెంబరు 22: మొన్నటి వరకు ఎక్సైజ్, సెబ్‌కు సీఐ, ఎస్ఐ పోస్టులు ఖాళీగా ఉన్నా అడిగేవారు లేరు. సెబ్‌ను రద్దుచేసి ఎక్సైజ్‌లోకి విలీనం చేయడంతో ఎక్సైజ్ శాఖకు పూర్వవైభవం వచ్చింది. కూటమి ప్రభుత్వం నూతన ఎక్సైజ్ విధానాన్ని తీసుకురావడంతోపాటు మద్యం దుకాణాలను ప్రైవేట్‌కు అప్పగిస్తామని పేర్కొనడంతో ఎక్సైజ్ శాఖలో కానిస్టేబుల్ నుంచి ఈఎస్ వరకు పోస్టులకు డిమాండ్ పెరిగింది. గత వైసీపీ హయాంలో ఎక్సైజ్, సెబ్‌కు పోలీసులు రావడానికి ఇష్ట పడేవారుకాదు. నూతన పాలసీ తీసుకురావడంతో ఇక కాసులవర్షం కురుస్తుందని ఎక్సైజ్ సీఐ, ఎస్ఐ పోస్టుల కోసం పోటీ పడుతున్నారు. ఎంతగా అంటే ఒక సీఐ పోస్టుకు ఐదుగురు చొప్పున పోటీ వస్తున్నట్లు తెలిసింది. ఇందుకోసం అధికార పార్టీకి చెందిన నాయకుల ద్వారా పైరవీలు చేస్తూ ఎమ్మెల్యే లేఖల కోసం ప్రదక్షిణ చేస్తున్నారు.

విపరీతంగా పైరవీలు

గత ఐదేళ్ల వైసీపీ పాలనలో ఎక్సైజ్ శాఖను విడగొట్టి సెబ్‌ను తీసుకొచ్చారు. దీంతో ఎక్సైజ్ కల్లు దుకాణాలకు పరిమితమైంది. కర్ణాటక నుంచి మద్యం అక్రమ రవాణాను అడ్డుకోవడం, ఇసుక, పేకాట, మట్కా, గంజాయి అరికట్టే బాధ్యత సెబ్‌కు అప్పగించారు. ఇది తీసుకొచ్చిన పాలసీ ఉద్దేశం ఏమిటోకానీ అందుకు విరుద్ధంగా జరిగింది. 2019వరకు గంజాయి మొక్క తెలియని వారికి సైతం పల్లెలకు కూడా ఈ మత్తు గుప్పుమంది. దీంతో కూటమి ప్రభుత్వం వచ్చాక సెబ్‌ను రద్దుచేసి, ఎక్సైజ్‌లోకి విలీనం చేశారు. ఈ పరిస్థితుల్లో ఎక్సైజ్‌కు మరింత బలం చేకూరడంతో ఆ శాఖలో పనిచేసేందుకు పైరవీలు చేస్తున్నారు. కానిస్టేబుల్ నుంచి సీఐ వరకు పోస్టుల కోసం ఎగబడుతున్నారు. ఇందులో చెక్ పోస్టుల కంటే స్టేషన్‌కు వెళ్లడానికే మక్కువ చూపుతున్నారు. ఎందుకంటే ఒక్క ఎక్సైజ్ పోలీసు స్టేషన్ పరిధిలో 10 నుంచి 20 మద్యంషాపులు, రెండుమూడు బార్లు ఉంటాయి. ఈ కారణంగా మంచి ఆదాయ వనరులుంటాయని దృష్టిలో ఉంచుకుని స్టేషన్లకు రావడానికి అధికశాతం మంది నాయకుల ద్వారా పైరవీలు చేస్తున్నారు.

సీఐ పోస్టుకు డిమాండ్

గత ఐదేళ్ల వైసీపీ పాలనలో సెబ్ సీఐగా రావడానికి జంకేవారు. అక్రమంగా మద్యాన్ని తరలిస్తున్నది వైసీపీ నాయకులే. వాటిని అడ్డుకుంటే నాయకుల నుంచి ఒత్తిడి వస్తుంది. ఒకవేళ వదిలేస్తే పైఅధికారుల నుంచి మాటపడాల్సి వస్తుందని ఈ పోస్టుకు వచ్చేవారు కాదు. ఎక్సైజ్ పోలీసు స్టేషన్ రావడంతో ఆదాయ వనరులు పుష్కలంగా ఉంటాయని పోటీపడుతున్నారు. పట్టణంలో కనీసం ఐదు నుంచి పది ఉంటాయి. దీనికితోడు హిందూపురం లాంటి పోలీసు స్టేషన్లలో 20 మద్యం షాపులైనా ఉంటాయి. ప్రతి నెలా ఆదాయం వస్తుందని భావిస్తున్నారు. గతంలో హిందూపురంలో ఒక మద్యం షాపునుంచి ఎక్సైజ్ పోలీసు స్టేషన్‌కు ప్రతినెలా రూ.30వేల నుంచి రూ.50వేలదాకా పంపేవారు. ప్రస్తుతం 20మద్యంషాపులు, బార్లు ఉండగా.. ఆ లెక్కన ఇప్పుడు కూడా ఇస్తారని ఎక్సైజ్ అధికారులు భావిస్తున్నారు.



దీంతో ప్రతినెలా కనీసం 8 నుంచి పది లక్షలు వస్తుందని భావించి, పోటీపడుతున్నారు. దీంతో కర్ణాటక సరిహద్దులో ఉన్న ఎక్సైజ్ పోలీసు స్టేషన్లకు మంచి గిరాకీ వచ్చిపడింది. జిల్లాలో ఎనిమిది ఎక్సైజ్ పోలీసు స్టేషన్లతోపాటు మూడు చెక్‌పోస్టులున్నాయి. దీంతో ఎక్సైజ్ స్టేషన్లలో పనిచేయడానికి మొగ్గు చూపుతున్నారు. ఇందులో మూడు పోలీసు స్టేషన్లకు రావడానికి ఒక్కో సీఐ రూ.25లక్షలు ఖర్చు చేస్తున్నట్లు ఆ శాఖలోని అధికారులు బహిరంగంగా చెప్పుకుంటున్నారు. జిల్లాలో ఒక కీలకమైన స్టేషన్‌కు సీఐగా రావడానికి ముగ్గురు మంత్రుల ద్వారా సిఫార్సు చేయించుకున్నారు. ఆ శాఖకు చెందిన సంఘం నాయకుడు తీవ్రంగా కృషిచేశాడు. ఎందుకంటే జిల్లాకు ఆ అధికారి వస్తుండటంతో తనకు కావాల్సిన సీఐలు ఉంటే భవిష్యత్తు బాగుంటుందని ముందుగానే ఆలోచించి తనకు కావాల్సిన వారిని కావాల్సిన చోటకు పంపిస్తున్నట్లు తెలిసింది. ఒక్క హిందూపురం ఎక్సైజ్ స్టేషన్‌కే ఆరేడుగురు పైరవీలు చేస్తుండగా.. ఆశాఖ యూనియన్ నాయకులు చెప్పిన అధికారికి హిందూపురం దక్కనున్నట్లు తెలిసింది. ఈ పరిస్థితుల్లో ఎక్సైజ్ అధికారులు.. ఎమ్మెల్యేల చుట్టూ సిఫార్సు లేఖల కోసం ప్రదక్షిణ చేస్తున్నారు. ఏది ఏమైనా ఎక్సైజ్‌కు కాలం కలిసి వచ్చిందని చెప్పవచ్చు.

గత పాలకుల నిర్లక్ష్యంతోనే ఈ దుస్థితి

జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు


మాట్లాడుతున్న మంత్రి నిమ్మల రామానాయుడు

కదిరి అర్బన్, సెప్టెంబరు 23: గత వైసీపీ పాలకుల నిర్లక్ష్య కారణంగానే రాయలసీమలో తాగు, సాగునీటి ప్రాజెక్టులకు ఈదుస్థితి ఏర్పడిందని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు విమర్శించారు. మండలంలోని చెర్లోపల్లి రిజర్వాయర్‌ను ఆదివారం రాత్రి మంత్రి పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ.. 2014-19 కాలంలో తక్కువ బడ్జెట్ ఉన్నా తాగు, సాగునీటి ప్రాజెక్టులపై అప్పటి టీడీపీ ప్రభుత్వం దృష్టి పెట్టిందన్నారు. అనంతరం వైసీపీ పాలనలో బడ్జెట్ రెట్టింపు అయినా, ప్రాజెక్టులను పూర్తి చేయలేదన్నారు. చెర్లోపల్లి రిజర్వాయర్ ప్రస్తుతం డెడ్ స్టోరేజీకి చేరుకుందన్నారు. కుప్పం బ్రాంచ్ కెనాల్ పూడిక, కంపచెట్లతో పూడుకుపోయిందన్నారు. వెంటనే మరమ్మతులు చేపడతామన్నారు. రాజర్వాయర్‌కు దిగువభాగాన ఉన్న దిగువపల్లిలో ఊటనీటితో ఇబ్బంది పడుతున్నట్లు గ్రామస్థులు.. మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. తమ వ్యవసాయ బోర్లు రిజర్వాయర్‌లోకి వెళ్లిపోయాయనీ, ఆర్అండ్ ఆర్ ప్యాకేజీ కింద స్థలాలిచ్చి, ఇళ్లు నిర్మించాలని కోరారు. దీనిపై మంత్రి.. జిల్లా కలెక్టర్ టీఎస్ చేతన్‌తో ఫోన్‌లో మాట్లాడారు. ముంపు గ్రామంలో ఇళ్లు కట్టించడానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమలో ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్, ఆర్డీఓ వంశీకృష్ణ, హెచ్ఎన్ఎస్ఎస్ అధికారులు పాల్గొన్నారు.

అన్ని చెరువులకు నీరివ్వండి

మంత్రి నిమ్మలకు సవిత వినతి


మంత్రి నిమ్మల రామానాయుడుకు వినతిపత్రం ఇస్తున్న మంత్రి సవిత

పుట్టపర్తి, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లా వరప్రదాయణిగా భావించే హంద్రీనీవా సుజల స్రవంతి పథకంతో అన్ని చెరువులకు సమృద్ధిగా నీరు ఇవ్వాలని రాష్ట్ర బీసీ సంక్షేమ, చేనేత జౌళి శాఖ మంత్రి సవిత.. జలవనరుల మంత్రి నిమ్మల రామానాయుడును కోరారు. హంద్రీనీవా జీడిపల్లి రిజర్వాయర్ పరిశీలనకు వచ్చిన మంత్రి రామానాయుడును అనంతపురంలోని ఆర్అండ్‌బీ అతిథి భవనంలో మంత్రి సవిత కలిసి వినతిపత్రం అందించారు. మంత్రి సవిత మాట్లాడుతూ.. డ్యాంలు నిండిపోయి, హంద్రీనీవా ద్వారా కృష్ణాజలాలు జిల్లావైపు పరుగులు పెడుతున్న నేపథ్యంలో సకాలంలో అన్ని చెరువులకు సమృద్ధిగా నీరివ్వాలన్నారు. పెనుకొండ, హిందూపురం, మడకశిర నియోజకవర్గాలకు తాగు, సాగు నీరు సరఫరా చేయాలన్నారు. మడకశిర ఉపకాలువలో నీరు పారాలంటే ఇబ్బందిగా ఉందనీ, కాలువను ఆధునికీకరిస్తే సకాలంలో అన్ని చెరువులను నింపే అవకాశం ఉందని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. జిల్లా పారిశ్రామికాభివృద్ధికి నీరే ఆధారమన్నారు. సమృద్ధిగా నీరివ్వాలని మంత్రిని కోరారు. ఈఅంశాలపై మంత్రి నిమ్మల రామానాయుడు సానుకూలంగా స్పందించారు.

చెరువులు నింపేందుకు నిధులివ్వండి

పుట్టపర్తి: నియోజకవర్గంలోని 195 చెరువులను ఎత్తిపోతల పథకం ద్వారా కృష్ణా జలాలతో నింపేందుకు నిధులు మంజూరు చేయాలని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రాయానాయుడును ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి కోరారు. మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డితో కలిసి అనంతపురంలోని ఆర్అండ్‌బీ అతిథిగృహంలో మంత్రి నిమ్మలను కలిశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. భారీ వర్షాలు లేక కొన్నేళ్లుగా చెరువులకు నీరు రావడంలేదన్నారు. ఎత్తిపోతల పథకం ద్వారా చెరువులకు నీరందించేందుకు నిధులు మంజూరు చేయాలన్నారు. దీనిపై మంత్రి సానుకూలంగా స్పందించారని ఎమ్మెల్యే తెలిపారు.

మహిళల సొమ్ము స్వాహా

సంఘాల నిధులు కాజేసిన యానిమేటర్

రికవరీలో అధికారులు విఫలం


గుడిబండ వెలుగు కార్యాలయం

గుడిబండ, సెప్టెంబరు 22: మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలనే ఉద్దేశంతో ప్రభుత్వం డ్వాక్రా సంఘాలను ఏర్పాటు చేసింది. మహిళా సంఘాల సభ్యులు పైసా పైసా కూడబెట్టుకుని పోగుచేసుకున్న నిధులను యానిమేటర్ స్వాహా చేశాడు. ఏకంగా రూ.13లక్షలను మండలంలోని పీసీగిరి గ్రామ యానిమేటర్ సురేష్ కాజేశాడు. గ్రామంలో 13 మహిళా సంఘాలున్నాయి. కల్పన గ్రామైక్య సంఘాన్ని ఏర్పాటు చేసుకున్నారు. ఈ సంఘం ద్వారా స్త్రీనిధి బ్యాంకు లింకేజీ, ప్రభుత్వం నుంచి వచ్చే నిధులను సంఘాల సభ్యులు పొదుపు చేసుకున్నారు. 2019లో వైసీపీ అధికారంలోకి వచ్చాక గతంలో పనిచేస్తున్న యానిమేటర్ చెన్నప్పను తొలగించి, అధికార పార్టీకి చెందిన సురేష్‌ను నియమించారు. సురేష్.. సంఘాల సభ్యుల సంతకాలు చేయించుకుని, బ్యాంకుల ద్వారా రుణాలు తీసుకుని తన ఖాతాలకు జమచేసుకునేవాడు. రుణాల కంతుల సొమ్మును బ్యాంకుకు చెల్లిస్తానని మహిళలకు మాయమాటలు చెప్పి, డబ్బు తీసుకుని సొంతానికి వాడుకున్నాడు. డ్వాక్రా మహిళలు తరువాత వాస్తవం తెలుసుకుని కంగుతిన్నారు. తాము క్రమం తప్పకుండా కంతులు చెల్లించినా.. బ్యాంకులో జమకాకపోవడంతో యానిమేటర్ కాజేసినట్లు గుర్తించారు. అలా.. అతడి స్వాహాపర్వం బయటపడింది. కంతులు కట్టి కూడా.. మహిళా సంఘాల సభ్యులు అప్పులపాలయ్యారు. నిధులు స్వాహాచేసినా యానిమేటర్‌పై చర్యలు తీసుకోవడంలో అధికారులు విఫలమయ్యారని మహిళలు ఆరోపిస్తున్నారు. రుణాలు చెల్లించాలని మహిళా సంఘాల సభ్యులపై వెలుగు అధికారులు ఒత్తిడి తీసుకొచ్చారు. యానిమేటర్ సురేష్‌పై ఎన్ని ఫిర్యాదులు చేసినా గత వైసీపీ ప్రభుత్వ హయాంలో పట్టించుకోలేదని మహిళలు ఆరోపించారు. స్వాహాచేసిన యానిమేటర్ పరారీలో ఉన్నాడు. అధికారులు వెంటనే మహిళా సంఘాల సభ్యుల సొమ్ము స్వాహాచేసిన యానిమేటర్‌పై చర్యలు తీసుకోవాలని బాధితులు కోరుతున్నారు.

యానిమేటర్‌పై పోలీసులకు ఫిర్యాదు

పిసిగిరి గ్రామంలోని మహిళా సంఘం సభ్యుల నిధులను స్వాహాచేసిన యానిమేటర్ సురేష్‌పై గుడిబండ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు ఏరియా కోఆర్డినేటర్ నాగరాజు తెలిపారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారులకు కూడా తెలియజేసినట్లు ఆయన తెలిపారు.

అప్పుల పాలయ్యాం




సంఘాల సభ్యుల సంతకాలు చేయించుకుని వారి డబ్బు యానిమేటర్ సొంత ఖాతాలకు జమ చేయించుకుని, నిధులను కాజేశాడు. దీంతో సంఘం సభ్యులు అప్పుల పాలయ్యాం. వెంటనే అధికారులు స్పందించి చర్యలు తీసుకుని, నిధులను రికవరీ చేయించాలి.

- గంగమ్మ, పిసిగిరి మహిళా సంఘం సభ్యురాలు

ఆహ్లాదం..

పచ్చదనం పరచుకున్న సీబీఆర్ పరిసరాలు.. పెరిగిన సందర్శకుల తాకిడి


డ్యాంలో నిల్వ ఉన్న నీరు


పచ్చదనం పరచుకున్న డ్యాం పైభాగం


డ్యాంను తిలకిస్తున్న సందర్శకులు


డ్యాం పైభాగాన ఉన్న అతిథిగృహం

తాడిమర్రి, సెప్టెంబరు 22: మండల సరిహద్దులోని చిత్రావతి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ (సీబీఆర్) పరిసర ప్రాంతాలు పచ్చికతో కళకళలాడుతూ సందర్శకులకు ఆహ్లాదం పంచుతున్నాయి. సెలవు రోజుల్లో ప్రజలు డ్యాంను సందర్శించి, ఉదయం నుంచి సాయంత్రం వరకు అక్కడే సేద తీరుతున్నారు. వారికి అనువుగా డ్యాం పైబాగంలో నూతనంగా అతిథి గృహం నిర్మించి, హోటల్‌ను ఏర్పాటుచేశారు. డ్యాం నీటిలో విహరించేందుకు అనువుగా రెండు బోట్లను కూడా ప్రభుత్వం ఏర్పాటుచేసింది. ప్రస్తుతం డ్యాంలో ఐదున్నర టీఎంసీల నీరు నిల్వ ఉంది. గండికోట నుంచి రెండు పైపుల్లో ఎత్తిపోతల ద్వారా నీరు వస్తోంది. వాటికి తోడు లింగాల కుడికాలువకు గ్రావిటీ ద్వారా కొంత నీటిని వదులుతున్నారు. వీటన్నింటిని చూసి సందర్శకులు మైమరచిపోతున్నారు.

రాష్ట్ర హాకీ జట్టుకు ధర్మవరం క్రీడాకారుల ఎంపిక


హాకీ రాష్ట్ర జట్టుకు ఎంపికైన క్రీడాకారులు

ధర్మవరంరూరల్, సెప్టెంబరు22: రాష్ట్ర హాకీ జట్టుకు పట్టణానికి చెందిన ఫజులుద్దీన్, శబరీష్‌గౌడ్ ఎంపికయ్యారు. హాకీ ఇండియా ఆధ్వర్యంలో ఈనెల 23వ తేదీ నుంచి చండీగఢ్‌లో నిర్వహించే జాతీయస్థాయి సబ్‌జూనియర్ బాలుర హాకీ పోటీల్లో రాష్ట్ర జట్టు తరఫున వీరు ఆడనున్నారు. వారిని పలువురు హాకీ సంఘం సభ్యులు అభినందించారు.

ఆరోగ్య సంరక్షణలో ఐటీది కీలకపాత్ర

శ్రీసత్యసాయి సెంట్రల్ ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ ఆర్జే రత్నాకర్

పుట్టపర్తిరూరల్, సెప్టెంబరు 22: ఆరోగ్య సంరక్షణలో ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ(ఐటీ)ది కీలక పాత్ర అని శ్రీసత్యసాయి సెంట్రల్‌ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ ఆర్జే రత్నాకర్ పేర్కొన్నారు. ఆదివారం స్థానిక ప్రశాంతిగ్రామ్ శ్రీసత్యసాయి సూపర్‌స్పెషాలిటీ హాస్పిటల్‌లో జ్యోతిప్రజ్వలన చేసి, హాస్పిటల్ మేనేజ్‌మెంట్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్ 'ఆత్మ' అనే అధునాతన సాఫ్ట్‌వేర్ అప్‌గ్రేడ్ సిస్టంను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. 1990వ దశకంలో ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ అంతంతమాత్రంగా ఉన్న సమయంలోనే సత్యసాయిబాబా ఆరోగ్య సంరక్షణలో భవిష్యత్తు ఇన్ఫర్మేషన్ టెక్నాలజీనే ప్రధానపాత్ర పోషిస్తుందని తెలియజేశారన్నారు. ఆత్మ సాఫ్ట్‌వేర్ అప్‌గ్రేడ్ వలన మానవకేంద్రీకృత విధానంతో హైఎండ్ టెక్నాలజీని ఒకచోట చేర్చి ఆరోగ్య సంరక్షణ ప్రక్రియలను సరళతరం చేసి సమర్థవంతంగా పని చేస్తుందన్నారు. ఆరోగ్యసంరక్షణ నిపుణులు తయారు చేయడం ఆ సాఫ్ట్‌వేర్ ప్రత్యేకత అన్నారు. సాఫ్ట్‌వేర్‌లోని ఫీచర్లు ల్యాబ్, రేడియాలజీ వంటి ఆసుపత్రి పరికరాల సామర్థ్యాన్ని పెంచుతాయన్నారు. సాఫ్ట్‌వేర్ పూర్తిగా వెబ్ ఆధారితమైనది కావడంతో వినియోగించడం సులభమన్నారు. ఆరోగ్యసంరక్షణ నిపుణులకు ప్రపంచవ్యాప్తంగా ఎక్కడి నుంచైనా పేషెంట్ కేర్ సమాచారాన్ని యాక్సెస్ చేయడం, పర్యవేక్షించడం సులభతరం చేస్తుందన్నారు. వైద్యులు, నర్సులకు ప్రత్యేక యాప్ ద్వారా బెడ్‌వద్దనున్న రోగి డేటాను సులభంగా తెలుసుకునే అవకాశం ఉంటుందన్నారు. 1954లో జనరల్ హాస్పిటల్ ప్రారంభం నుంచి 1991 ప్రపంచస్థాయి సూపర్‌స్పెషాలిటీ హాస్పిటల్‌ను ఏర్పాటు చేసి, పేదలకు ఉచితవైద్యసేవలందించడం వరకు సత్యసాయిబాబా మెడికేర్ మిషన్ ప్రస్థానాన్ని కొనసాగిస్తూ ఆత్మ సాఫ్ట్‌వేర్ ప్రారంభం తన నిస్వార్థసేవలను కొనసాగిస్తుందని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో శ్రీసత్యసాయి గ్లోబల్ కౌన్సిల్ చైర్మన్ చక్రవర్తి, శ్రీసత్యసాయి విద్యాసంస్థల వీసీ రాఘవేంద్రప్రసాద్, సూపర్‌స్పెషాలిటీ హాస్పిటల్ డైరెక్టర్ డాక్టర్ గురుమూర్తి, జాయింట్ డైరెక్టర్ అనిల్‌కుమార్, వైట్‌ఫీల్డ్ శ్రీసత్యసాయి సూపర్‌హాస్పిటల్ డైరెక్టర్ డాక్టర్ సుందరేషన్ పాల్గొన్నారు.



అధునాతన సాఫ్ట్‌వేర్‌ను ఆవిష్కరిస్తున్న ఆర్జే రత్నాకర్

హౌసింగ్‌లో బదిలీలు

అనంతపురం సిటీ, సెప్టెంబరు 22: జిల్లా గృహ నిర్మాణశాఖలో పని చేస్తున్న ఆరుగురు రెగ్యులర్ ఏఈలు, 14మంది అవుట్‌సోర్సింగ్ ఏఈలు, మండల ఇన్‌చార్జిలు, 19మంది కంప్యూటర్ ఆపరేటర్లను బదిలీ చేస్తూ జిల్లా కలెక్టర్ వినోద్ కుమార్ ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు.

పేరు	హోదా	ప్రస్తుత స్థానం	బదిలీ స్థానం
జమీల్ అహ్మద్	ఏఈ	అనంతపురం అర్బన్	ఆత్మకూరు
రామ్మూర్తి	ఏఈ	అనంతపురం రూరల్	బీకేఎస్
షాషావలీ	ఏఈ	గుంతకల్లు	పెద్దపప్పూరు
విజయభాస్కర్‌రావు	ఏఈ	కళ్యాణదుర్గం(ఎస్‌డీ)	కళ్యాణదుర్గం రూరల్
హనుమప్ప	ఏఈ	ఉరవకొండ (ఎస్‌డీ)	కూడేరు
లోక్‌నాథచౌదరి	ఏఈ	కళ్యాణదుర్గం రూరల్	కళ్యాణదుర్గం అర్బన్

అవుట్ సోర్సింగ్ ఏఈలు, మండల ఇన్‌చార్జిలు ఇలా..

అనిల్‌కుమార్	ఏఈ	ఆత్మకూరు	గార్లదిన్నె
సంపత్‌కుమార్	ఏఈ	పామిడి	నార్పల
రాజశేఖర్‌రెడ్డి	ఏఈ	బీకేఎస్	తాడిపత్రి అర్బన్
సంధ్య	ఏఈ	తాడిపత్రి అర్బన్	పుట్లూరు
నవీన్‌కుమార్	ఎంఐసీ	పెద్దపప్పూరు	తాడిపత్రి రూరల్
లోకేష్‌కుమార్	ఎంఐసీ	పుట్లూరు	యాడికి
ప్రశాంత్‌కుమార్	ఎంఐసీ	యాడికి	గుమ్మఘట్ట
వాసంతి	ఏఈ	గుమ్మఘట్ట	బొమ్మనహాల్
రామ్మోహన్	ఏఈ	కళ్యాణదుర్గం అర్బన్	బ్రహ్మసముద్రం
చైతన్యరాజ్	ఎంఐసీ	బ్రహ్మసముద్రం	రాయదుర్గం రూరల్
శివారెడ్డి	ఏఈ	బెళుగుప్ప	అనంతపురం అర్బన్
శేఖర్	ఏఈ	కూడేరు	విడపనకల్లు
గోపీచాంద్‌నాయక్	ఎంఐసీ	విడపనకల్లు	బెళుగుప్ప
మారుతి	ఎంఐసీ	గుంతకల్లు అర్బన్	పామిడి

విద్యుత్ శాఖలో..

అనంతపురంరూరల్, సెప్టెంబరు 22: ఉమ్మడిజిల్లా విద్యుత్ శాఖ పరిధిలో ఉద్యోగులు, సిబ్బంది బదిలీలు ఆదివారం పూర్తయ్యాయి. ఆ మేరకు ఎస్‌ఈ సంపత్‌కుమార్ బదిలీ ఉత్తర్వులు జారీ చేశారు. జేఏఓలు 14 మంది, సీనియర్ అసిస్టెంట్లు 50 మంది, జూనియర్ అసిస్టెంట్లు 69 మంది, ఓఎస్ఓలు ఆరుగురు, ఎఫ్ఎం గ్రేడ్-1 ఇద్దరు, సీనియర్ లైన్‌ఇన్‌స్పెక్టర్లు ఇద్దరిని బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీచేశారు. పలువురు లైన్‌మెన్, ఫోర్‌మెన్లకు ఉద్యోగోన్నతులు కల్పిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

ఉమ్మడి జిల్లాకు ముగ్గురు ఎంపీడీఓలు
ఇతర జిల్లాలకు ఆరుగురు బదిలీ

అనంతపురం విద్య, సెప్టెంబరు 22: ఉద్యోగుల సాధారణ బదిలీలలో భాగంగా ఇతర జిల్లాల నుంచి ఉమ్మడి అనంతపురం జిల్లాకు ముగ్గురు ఎంపీడీఓలను కేటాయించారు. జిల్లా నుంచి ఆరుగురు ఎంపీడీఓలను ఇతర జిల్లాలకు బదిలీ చేశారు. ఈ మేరకు పంచాయతీ రాజ్‌శాఖ డైరెక్టర్ క్రిష్ణతేజ ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. వైఎస్ఆర్ కడప జిల్లా నుంచి ఎంపీడీఓ వెంకటరామిరెడ్డి, చిత్తూరు జిల్లా నుంచి పోలప్ప, యాదవేంద్ర అనంతపురం జిల్లాకు బదిలీ అయ్యారు. అదేవిధంగా అనంతపురం జిల్లా నుంచి ఎంపీడీఓలు సాల్మన్, వరలక్ష్మి, పుల్లయ్య, విజయలలిత, రఘునాథ్ కర్నూలు జిల్లాకు, కిరణ్ మోహన్‌రావు కడప జిల్లాకు బదిలీ అయ్యారు.

అటవీ శాఖలో...

అనంతపురం న్యూటౌన్, సెప్టెంబరు 22: సాధారణ బదిలీల్లో భాగంగా ఆదివారం జిల్లాలో పలువురు రేంజర్లు బదిలీ అయ్యారు. సోషల్ ఫారెస్ట్ రేంజర్‌గా ఉన్న డేవిడ్‌ను స్క్వాడ్ పార్టీ రేంజర్‌గా ఆత్మకూరుకు బదిలీ చేశారు. ఖాళీగా ఉన్న కళ్యాణదుర్గం రేంజ్‌కు తిరుపతి నుంచి లక్ష్మీపతిని రేంజర్‌గా నియమించారు.

సూపరింటెండెంట్ల నియామకం

జిల్లా అటవీశాఖలో ఇద్దరు సూపరింటెండెంట్లను నియమిస్తూ ఆదివారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. అమానుల్లాషాను కర్నూలు డివిజన్ కార్యాలయం నుంచి సీసీఎఫ్ కార్యాలయానికి నియమించారు. తిరుపతి సర్కిల్ కార్యాలయం నుంచి వెంకటపతిని అనంతపురం టెరిటోరియల్ డివిజన్‌కు బదిలీ చేశారు.

డ్వామా పీడీగా సలీం

అనంతపురం క్లాక్‌టవర్: డ్వామా పీడీగా సలీం బాషా నియమితులయ్యారు. కర్నూలు డీఆర్‌డీఏ-వెలుగు పీడీగా పనిచేస్తున్న సలీంబాషాను ఇక్కడ జిల్లా డ్వామా పీడీగా బదిలీ చేశారు. ఇక్కడ పీడీగా పనిచేస్తున్న వేణుగోపాల్‌రెడ్డిని మాతృశాఖ జైళ్ల డిపార్ట్‌మెంట్‌కు బదిలీ చేసిన విషయం తెలిసిందే. దీంతో డ్వామా ఏఓగా ఉన్న విజయలక్ష్మి ఇన్‌చార్జి పీడీగా కొనసాగారు. ఇన్‌చార్జి పీడీగా ఉన్న విజయలక్ష్మిని గుంతకల్లు డీఎల్‌డీఓగా బదిలీ చేశారు. డ్వామాలో ఎఫ్ఎంగా పనిచేస్తున్న వెంకటనాయుడును ప్రకాశం జిల్లా డీపీఓగా బదిలీ చేశారు. డ్వామాలో ఏఓ, ఎఫ్ఎం పోస్టులను భర్తీ చేయాల్సి ఉంది.

డీఆర్‌డీఏ-వెలుగు పీడీ బదిలీ

డీఆర్‌డీఏ-వెలుగు ఇన్‌చార్జి పీడీ ఓబులమ్మను కడప జడ్పీ సీఈఓగా బదిలీ చేశారు. ఇది వరకు రెగ్యులర్ పీడీగా ఉన్న నరసింహారెడ్డిని జోన్ డీఎల్‌డీఓగా బదిలీ చేశారు. డీఆర్‌డీఏ-వెలుగు పీడీగా ఎవరినీ నియమించలేదు.

డీపీఓగా నాగరాజునాయుడు

అనంతపురం న్యూటౌన్: జిల్లా పంచాయతీ అధికారి ప్రభాకర్‌రావు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో కర్నూలు డీపీఓగా ఉన్న నాగరాజునాయుడుని నియమిస్తూ ఆ శాఖ ఉన్నతాధికారులు ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. కూటమి ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి డీపీఓ ప్రభాకర్‌రావు బదిలీపై పలుమార్లు చర్చలు జరిగాయి. ఎన్నికల సమయంలో వైసీపీకి కొమ్ముకాశారని అనంతపురం ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ ఫిర్యాదు కూడా చేశారు. ప్రభాకర్‌రావు ఇక్కడే ఉండటానికి చేసిన ప్రయత్నాలు విఫలం కావడంతో ఎట్టకేలకు బదిలీ కాక తప్పలేదు.

అటవీశాఖాధికారిగా వినోద్‌కుమార్

పుట్టపర్తిరూరల్: జిల్లా సామాజిక అటవీశాఖాధికారిగా కె. వినోద్‌కుమార్‌ను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఆదివారం ఉత్వర్వులు జారీచేసింది. గతంలో జిల్లా సామాజిక వనవిభాగ అటవీశాఖాధికారిగా విధులు నిర్వర్తించిన శ్యామల పదోన్నతిపై కర్నూలు జిల్లాకు బదిలీపై వెళ్లారు. అదే విధంగా రాజమహేంద్రవరం టెరిటోరియల్ అటవీశాఖాధికారిగా విధులు నిర్వర్తిస్తున్న టి. చక్రపాణిని శ్రీసత్యసాయి జిల్లా డీఎఫ్ఓగా, ఆ జిల్లాలో డీఎఫ్ఓ విధులు నిర్వర్తిస్తున్న రవీంద్రనాథరెడ్డిని బదిలీ చేస్తూ రాష్ట్రప్రభుత్వ ప్రత్యేక కార్యదర్శి అనంతరాము ఉత్వర్వులు జారీచేశారు.

ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజనీర్ల బదిలీ..

అనంతపురం న్యూటౌన్: గ్రామీణ నీటి సరఫరా విభాగం (ఆర్‌డబ్ల్యూఎస్)లో పలువురు ఇంజనీర్లను బదిలీ చేశారు. ఈ మేరకు ఆదివారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. గత నెల 28న బదిలీల ప్రక్రియలో భాగంగా కర్నూలులోని సర్కిల్ కార్యాలయంలో కౌన్సిలింగ్‌కు హాజరయ్యారు. అందులో భాగంగా వారు ఇచ్చిన ఆప్షన్స్‌కు అనుగుణంగా స్థానాలు కేటాయించారు. శింగనమల డీఈగా ఉన్న గంగాధర్ బుక్కపట్నం డీఈగా బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో తాడిపత్రి డీఈగా ఉన్న శ్రీరాములును నియమించారు. ఆయన స్థానంలో పులివెందుల నుంచి రాంగోపాల్‌రెడ్డిని నియమించారు. రాప్తాడు డీఈగా ఉన్న రెహనా వసీం గుత్తికి బదిలీ అయ్యారు. ఆ స్థానంలో పులివెందుల నుంచి శ్రీధర్ నియమితులయ్యారు. కళ్యాణదుర్గం ఆపరేషన్స్, మెయింటెన్స్ డీఈగా ఉన్న శ్రీనివాసులు రాయదుర్గం డీఈగా బదిలీ అయ్యారు. క్వాలిటీ కంట్రోల్ డీఈగా ఉన్న కుసుకుమార్ కర్నూలు క్వాలిటీ కంట్రోల్ డీఈగా బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో విజయవాడ ఈఎన్‌సీ కార్యాలయం నుంచి రాంగోవిందరెడ్డిని నియమించారు. పుంగనూరు నుంచి కదిరి డీఈగా వెంకటేశ్వర్లు, ఆదోని నుంచి హిందూపురం డీఈగా శివనాగేశ్వరరావును నియమిస్తూ ఈఎన్‌సీ నుంచి ఆదివారం ఉత్తర్వులు వెలువడ్డాయి. ఇక శింగనమల ఏఈగా ఉన్న శ్రీనివాసులు కుందుర్పికి బదిలీ అయ్యారు. ఆ స్థానంలో నార్పల ఏఈ రవీంద్రనాథ్‌రెడ్డిని నియమించారు. గార్లదిన్నె ఏఈగా ఉన్న కల్యాణిని అనంతపురం డివిజన్ ఏఈగా బదిలీ చేశారు. బుక్కరాయసముద్రం ఏఈగా ఉన్న జనార్దన్‌ను నార్పలకు బదిలీ చేశారు. పుట్లూరు ఏఈగా ఉన్న రామలింగారెడ్డిని గుత్తి ప్రాజెక్టుకు బదిలీ చేశారు. ఆయన స్థానంలో క్వాలిటీ కంట్రోల్ ఏఈగా ఉన్న ప్రవీణ్‌కుమార్‌ను నియమించారు. అనంతపురం రూరల్ ఏఈగా ఉన్న ఆంజినేయులు పెద్దవడుగూరుకు, ఆత్మకూరు ఏఈగా ఉన్న హరి అనంతపురం రూరల్‌కు వరలక్ష్మిని రాప్తాడుకు, రాప్తాడు ఏఈ వెంకటేష్‌ను పెనుకొండ సబ్‌డివిజన్‌కు బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

సిమెంట్ దొంగల సంగతేంటి..?

- వైసీపీ ప్రభుత్వంలో 86 లోడ్లు పక్కదారి
- అమ్మేసి సొమ్ము చేసుకున్న వైనం
- టెండర్ వర్కుల పేరుతో ఇండెంట్
- ఏడాది గడిచినా కదలని విచారణ
- కేసులతోనే సరిపెట్టిన అధికారులు



శ్రీసత్యసాయి జిల్లా సమగ్రశిక్ష ప్రాజెక్టు కార్యాలయం

అనంతపురం విద్య, సెప్టెంబరు 22 : గత వైసీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన అక్రమాలు అన్నీ ఇన్నీ కావు. టెండర్ వర్కులకు రాయితీ కింద ఇచ్చే సిమెంట్‌ను లారీలకు లారీలు దారి మళ్లించిన ఘనులున్నారు. లక్షలాది రూపాయలు చేతులు మారాయి. నాడు ఉన్నతాధికారుల కళ్లు గప్పి...అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల సమగ్రశిక్ష ప్రాజెక్టు పరిధిలో 86 లోడ్ల సిమెంట్‌ను పక్కదారి పట్టించి సొమ్ము చేసుకున్నారు. నకిలీ లాగిన్స్ ద్వారా టన్నుల కొద్దీ సిమెంట్ అమ్మి సొమ్ము చేసుకున్న ఉద్యోగులపై కేసు నమోదు చేసి చేతులు దులుపుకున్నారు. గత ప్రభుత్వంలో కేసు నమోదైనా... తాజాగా టీడీపీ ప్రజాప్రతినిధుల ద్వారా కలెక్టర్‌ను ప్రసన్నం చేసుకుని ఉద్యోగం పొందాలని చూస్తున్నారని సమాచారం. వైసీపీ హయాంలో కుంభకోణాలు చేసిన వారికి కొందరు ప్రజాప్రతినిధులు సిఫార్సు చేయడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఏడాదికి పైగా ఈ కేసును అటు అనంతపురం, ఇటు శ్రీసత్యసాయి జిల్లాల విద్యాశాఖాధికారులు, కలెక్టర్లు పట్టించుకోకపోవడం విమర్శలకు తావిస్తోంది.

చేయాల్సింది ఇలా...!

ప్రభుత్వం నుంచి టెండర్ వేసిన అభివృద్ధి పనులకు రాయితీపై సిమెంట్ సరఫరా చేస్తారు. ఉమ్మడి అనంతపురం జిల్లా వ్యాప్తంగా సుమారు 40 మండలాల్లో ప్రభుత్వ పాఠశాలల్లో పలు రకాల పనులతోపాటు, మరో 16 కేజీబీవీ స్కూళ్లు, జూనియర్ కళాశాలల్లో అభివృద్ధి నిర్వహించారు. ఈ పనులు చేసేందుకు కాంట్రాక్టర్లు రాయితీ కింద సిమెంట్‌ను తీసుకోవచ్చు. ఎల్-2 ఆఫీసర్ (ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్) నామినేట్ చేసిన ఎల్-1 ఆఫీసర్ (డివిజనల్ ఇంజనీర్) యూజర్ ఐడీ లాగిన్ ద్వారా కాంట్రాక్టర్ సబ్సిడీ సిమెంట్‌కు ఆన్‌లైన్‌లో పేమెంట్ చేయాల్సి ఉంటుంది. ఎల్-1 నుంచి ఇండెంట్ ఎల్-2కు వచ్చిన తర్వాత దాన్ని ఎల్-2 ఆఫీసర్ తన పైన ఉండే ఎల్-3 ఆఫీసర్ (కలెక్టర్)కు ఇండెంట్ పంపుతారు. ఆ మేరకు ఎల్-3 ఆఫీసర్ ఇండెంట్ సరఫరా చేసేలా వైఎస్ఆర్ నిర్మాణ్ పోర్టల్‌కు పంపుతారు. ఈ ప్రక్రియ పూర్తయితే కాంట్రాక్టర్లు పెట్టుకున్న ఇండెంట్ మేరకు నేరుగా స్కూల్, కళాశాల, లేదా పని జరుగుతున్న ప్రాంతానికి సిమెంట్ సరఫరా చేస్తారు.

కుట్ర చేసింది ఇలా..!

జిల్లాల విభజన సమయంలో సిమెంట్ కుంభకోణానికి బీజం పడింది. అనంతపురం సమగ్రశిక్ష ప్రాజెక్టులో పనిచేస్తున్న ఇద్దరు అవుట్ సోర్సింగ్ సిబ్బంది చక్రం తిప్పినట్టు తెలుస్తోంది. అనంతపురం జిల్లా నుంచి శ్రీసత్యసాయి జిల్లాలో స్కాం సాగించినట్టు తెలుస్తోంది. సిమెంట్ ఇండెంట్ పంపే ఎల్-1, ఎల్-2గా తమ సెల్‌ఫోన్ నెంబర్లతోనే యూజర్ ఐడీ లాగిన్స్ సృష్టించుకున్నారు. తమ సెల్ నెంబర్లను యూజర్ ఐడీ మ్యాపింగ్ చేసుకుని ఉన్నతాధికారులకు తెలియకుండా డబ్బులు కట్టి...సిమెంట్ బుక్ చేసుకుంటూ వచ్చారు. ఇలా 64 సార్లు ఇండెంట్ పంపారు. ఏకంగా 86 లోడ్ల సబ్సిడీ సిమెంట్‌ను రప్పించారు. కేజీబీవీలు, స్కూళ్లలో అప్పటికే పనులు సుమారు 90 శాతం పూర్తయాయ్యయి. సబ్సిడీ కింద తెప్పించుకున్న సిమెంటును అమ్మి సొమ్ము చేసుకున్నట్టు స్పష్టమవుతోంది. ఈ క్రమంలో రూ.13 లక్షల నుంచి రూ.25 లక్షల వరకూ సొమ్ము కొందరు ఉద్యోగుల జేబుల్లోకి చేరినట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి.



అనంతపురం జిల్లా ప్రాజెక్టు కార్యాలయం

కేసులు నమోదు చేసి వదిలేశారా..?

గత ప్రభుత్వంలో సమగ్ర ప్రాజెక్టు పరిధిలో సాగిన ఈ తంతుపై ఉన్నతాధికారుల నుంచి ఫిర్యాదులు వెళ్లడంతో సంబంధిత ఉద్యోగులపై కేసులు నమోదు చేశారు. అనంతపురం నగరంలోని వన్‌టౌన్‌లో 420, 406 సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. 2022 మే నుంచి 2023 జూన్ 18వ తేదీ వరకూ ఈ స్కాం సాగినట్టు పోలీసుల విచారణలో తేలింది. ఇద్దరు ఉద్యోగులపై కేసులు నమోదు కావడంతో... సమగ్రశిక్ష ఉన్నతాధికారులు వారిపై వేటు వేశారు. ఏకంగా 86 లోడ్ల సిమెంట్ ఒకే కంపెనీ నుంచి ఒకే ట్రాన్స్‌పోర్ట్ ద్వారా తెప్పించి అమ్మి సొమ్ము చేసుకున్నారు. ఈ స్కాంపై లోతైన దర్యాప్తు చేయాల్సిన అవసరం ఎంతైనాఉంది.

పోస్టింగ్ కోసం పైరవీలు

సిమెంట్ అక్రమాల కేసులో కేసు నమోదయిన ఓ మాజీ ఉద్యోగి మళ్లీ పోస్టింగ్ కోసం ప్రయత్నాలు సాగిస్తున్నట్టు తెలిసింది. వైసీపీ హయాంలో అడ్డగోలుగా సంపాదించి ఉద్యోగం కోల్పోయిన అవుట్ సోర్సింగ్ ఉద్యోగి ఇప్పుడు టీడీపీ ప్రజాప్రతినిధుల ద్వారా అనంతపురం జిల్లా విద్యాశాఖ ఉన్నతాధికారులపై ఒత్తిడి తెస్తున్నట్టు సమాచారం. సిమెంట్ కుంభకోణంలో మోసం చేసిన వారిపై చర్యలు తీసుకోకుండా, మింగిన సొమ్ము కక్కించకుండా వదిలేయడంపై అనేక ఆరోపణలు వస్తున్నాయి.

దులీప్ ట్రోఫీ విజేత ఇండియా-ఎ

చివరి మ్యాచ్‌లో రాణించిన బౌలర్లు
డ్రా అనుకున్న పోటీల్లో తేలిన ఫలితం



విన్నర్ ఇండియా-ఎ జట్టు

అనంతపురం క్లాక్‌టవర్, సెప్టెంబరు 22: దులీప్‌ట్రోఫీ విజేతగా ఇండియా-ఎ జట్టు నిలిచింది. ఆరు మ్యాచ్‌ల సిరీస్‌లో ఇండియా-ఎ రెండు మ్యాచ్‌లను గెలిచి 12పాయింట్లతో అగ్రస్థానంలో నిలిచింది. దీంతో విజేత ట్రోఫీని సొంతం చేసుకుంది. అనంతపురం క్రికెట్ గ్రౌండ్‌లో 19 నుంచి జరిగిన రెండు మ్యాచ్‌లు ఆదివారం ముగిశాయి. ఏసీజీ-ఏ మైదానంలో జరిగిన మ్యాచ్‌లో ఇండియా-ఎ, ఇండియా-సి జట్ల మధ్య పోటీ జరిగింది. ఈ మ్యాచ్‌లో ఇండియా-ఎ 132పరుగుల భారీ తేడాతో విజయం సాధించింది. డ్రా అవుతుందనుకున్న మ్యాచ్‌ను బౌలర్లు ప్రసిద్ధ్‌కృష్ణ, తనుష్ కోటియాన్ చెరో 3వికెట్లు, ఆకీబ్‌ఖాన్ 2 రెండు వికెట్లు పడగొట్టి ఇండియా-ఎ జట్టును విజేతగా నిలిపారు. కాగా ఇండియా-సి ఆటగాడు సాయి సుదర్శన్ (117) సెంచరీ వృథా అయ్యింది. మొదటి ఇన్నింగ్స్‌లో 124పరుగులు, రెండో ఇన్నింగ్స్‌లో 53పరుగులతో జట్టు విజయంలో కీలకపాత్ర పోషించిన షాషావత్ రావత్‌కు ప్లేయర్ ఆఫ్‌ది మ్యాచ్ అవార్డు దక్కింది.

స్కోరు వివరాలు

ఇండియా-ఎ
మొదటి ఇన్నింగ్స్: 297 పరుగులు
రెండో ఇన్నింగ్స్ 286-6 డిక్లేర్
ఇండియా-సి
తొలి ఇన్నింగ్స్ 234 పరుగులు
రెండో ఇన్నింగ్స్ 217పరుగులు
ఫలితం: 132పరుగుల తేడాతో ఇండియా-ఎ విజయం

స్కోరు వివరాలు

ఇండియా- డి
తొలి ఇన్నింగ్స్: 349పరుగులు,
రెండో ఇన్నింగ్స్‌లో 305
ఇండియా-బి తొలి ఇన్నింగ్స్‌లో 282పరుగులు,
రెండో ఇన్నింగ్స్‌లో 115పరుగులు
ఫలితం: 257 పరుగుల తేడాతో ఇండియా-డి విజయం

సాయి సుదర్శన్ సెంచరీ వృథా

ఓవర్‌నైట్ స్కోర్ 270-6తో ఇన్నింగ్స్ ఆరంభించిన ఇండియా-ఎ జట్టు మరో 18పరుగులు జోడించి 286-8 వద్ద డిక్లేర్ చేసింది. ఇండియా-సి బౌలర్లు గౌరవ్‌యాదవ్ 4, అన్షుల్‌కాంబోజ్, మానవ్‌సుతార్ చెరో 2 వికెట్లు పడగొట్టారు. అనంతరం 345 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన ఇండియా-సి జట్టు 81.5ఓవర్లలో 217 పరుగులకు ఆలౌట్ అయ్యింది. ఓపెనర్లు కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్ 44పరుగులు, విజయ్‌కుమార్ వైశాక్ 17పరుగులు మాత్రమే సాధించారు. సాయి సుదర్శన్ 206బంతుల్లో 12బౌండరీలతో 111పరుగులు చేశాడు. మిగతా బ్యాటర్లు ఎవరూ రాణించకపోవడంతో ఇండియా-సికి ఓటమి తప్పలేదు.

శతకంతో గెలిపించిన తెలుగుతేజం రికీ భుయ్

దులీప్‌ట్రోఫీలో భాగంగా అనంతపురం క్రికెట్ గ్రౌండ్-బిలో నిర్వహించిన చివరి మ్యాచ్‌లో తెలుగుతేజం రికీ భుయ్ సెంచరీతో జట్టుకు విజయాన్నందించాడు. చివరి మ్యాచ్ ఇండియా- బి, ఇండియా- డి జట్ల మధ్య సాగింది. డ్రాగా ముగుస్తుందనుకున్న మ్యాచ్‌లో ఇండియా- డి బౌలర్లు తమ బౌలింగ్ నైపుణ్యంతో ఫలితం రాబట్టారు.

ఓవర్‌నైట్ స్కోర్ 244-5తో చివరి రోజు ఆదివారం ఇన్నింగ్స్‌ను ఆరంభించిన ఇండియా-డి జట్టు మరో 61పరుగులు జోడించి 305పరుగులు ఆలౌట్ అయ్యింది. 90 పరుగులతో నాలుగో రోజు ఆట ఆరంభించిన తెలుగుతేజం రిక్కీభూయ్ 124బంతుల్లో 15బౌండరీలు, 3సిక్సర్లతో 119పరుగులు సాధించి అజేయంగా నిలిచాడు. ఇండియా-బి బౌలర్లలో ముఖేష్‌కుమార్ 4, నవదీప్ షైనీ 3 వికెట్లు పడగొట్టారు. అనంతరం 372 భారీ పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన ఇండియా-బి ఏదశలోనూ పోటీ ఇవ్వలేకపోయింది. ప్రధాన బ్యాటర్లు చేతులెత్తేయడంతో 115 పరుగులకే కుప్పకూలింది. ఇందులో నలుగురు బ్యాటర్లు డకౌట్ కావడం గమనార్హం. ఇండియా- డి బౌలర్లు అర్షదీప్ సింగ్ 6, ఆదిత్య థాకరే 4 వికెట్లు పడగొట్టి ఇండియా- బి పతనాన్ని శాసించారు. ఇండియా-డి జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తున్న తెలుగుతేజం రిక్కీభూయ్ మొదటి ఇన్నింగ్స్‌లో 56, రెండో ఇన్నింగ్స్‌లో 119పరుగులతో నాటౌట్‌గా నిలిచి ప్లేయర్ ఆఫ్‌ది మ్యాచ్ అవార్డు అందుకున్నారు. ఆరు వికెట్లు పడగొట్టిన ఇండియా- డి బౌలర్ అర్షదీప్ సింగ్‌కు ఉత్తమ బౌలర్ అవార్డు అందజేశారు. రిక్కీభుయ్‌కి బెస్ట్ స్ట్రైకర్ ఆఫ్‌ది సిరీస్ అవార్డు లభించింది. ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్, జిల్లా కలెక్టర్ వినోద్‌కుమార్, ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి సానా సతీష్, ఆర్డీటీ ప్రోగ్రాం డైరెక్టర్ మాంచో ఫెర్రర్‌లు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్డీటీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అన్నే ఫెర్రర్, జిల్లా జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ్‌శర్మ, ఆర్డీఓ వసంతబాబు తదితరులు పాల్గొన్నారు.









ప్లేయర్ ఆఫ్ ది సిరీస్ అన్షుల్ కాంబోజ్, ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ రావత్ | బెస్ట్ స్ట్రయికర్ ఆఫ్ ది సిరీస్ రికీ భుయ్, అర్షదీప్‌సింగ్ (6 వికెట్లు)

రచ్చో రచ్చ!

- రెవెన్యూ బదిలీలపై మళ్లీ రగడ
- 120మందిని ట్రాన్స్‌ఫర్ చేస్తూ కలెక్టర్ ఉత్తర్వులు
- సిఫార్సు లేఖలను పక్కన పెట్టిన జాయింట్ కలెక్టర్
- డీటీలు, ఆర్ఐల నియామకాలపై నేతల అసంతృప్తి

అనంతపురం టౌన్, సెప్టెంబరు 22: రెవెన్యూ బదిలీలు ఉన్నతాధికారులు, ప్రజా ప్రతినిధుల మధ్య మళ్లీ చిచ్చు రేపుతున్నాయి. మండల స్థాయిలో తహసీల్దార్, ఎంపీడీఓ కార్యాలయ అధికారుల పాత్ర చాలా కీలకం. అధికార పార్టీ ప్రజాప్రతినిధులు తమకు అనుకూలంగా పనిచేసేవారిని నియమించుకోవాలని చూడటం సర్వసాధారణం. ఈమేరకు బదిలీల సమయంలో జిల్లా ఉన్నతాధికారులకు సిఫార్సు లేఖలు కూడా ఇస్తుంటారు. గత వైసీపీ పాలనలో ఆయా నియోజకవర్గ ఎమ్మెల్యేలు చెప్పినవారికి జిల్లా ఉన్నతాధికారులు కిమ్మనకుండా పోస్టింగ్ ఇచ్చారు. ప్రస్తుత టీడీపీ కూటమి ప్రభుత్వంలో ఇందుకు విరుద్ధంగా బదిలీల ప్రక్రియ కొనసాగడం రెవెన్యూ అధికారులు, ఉద్యోగ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు ఆదివారానికి సాధారణ బదిలీల ప్రక్రియ ముగిసింది. ఈనేపథ్యంలో జిల్లాలో 120మంది రెవెన్యూ ఉద్యోగుల బదిలీల ఉత్తర్వులను కలెక్టరు విడుదల చేశారు. ఇందులో డిప్యూటీ తహసీల్దార్లు 73మంది, ఆర్ఐలు, సీనియర్ అసిస్టెంట్లు కలిపి 33మంది, జూనియర్ అసిస్టెంట్లు 11మంది, టైపిస్టులు ముగ్గురు ఉన్నారు.

డీటీలు, ఆర్ఐ పోస్టింగ్‌లపైనే వివాదం

రెవెన్యూ బదిలీల్లో డిప్యూటీ తహసీల్దార్లు, ఆర్ఐల బదిలీలపైనే వివాదం మొదలైందని చర్చించుకుంటున్నారు. అందరూ ప్రజాప్రతినిధుల సిఫార్సు లేఖలు పెట్టాం, కోరుకున్న ప్లేస్‌లకు బదిలీలు వస్తాయని భావిస్తూ వచ్చారు. అయితే అందుకు విరుద్ధంగా బదిలీలలో పోస్టింగ్‌లు వేయడం చూసి అవాక్కయ్యారు. వెంటనే సిఫార్సు లేఖలు ఇచ్చిన ప్రజాప్రతినిధుల వద్దకు క్యూకట్టి బదిలీల వ్యవహారం గురించి వారికి వివరించారు. దీంతో ఆ ప్రజాప్రతినిధులు సైతం ఆశ్చర్యపోయినట్లు తెలిసింది. జిల్లా ఉన్నతాధికారుల తీరుపై ఆ నేతలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసినట్లు సమాచారం. ఈబదిలీలు కలెక్టరు, జేసీల మధ్య కూడా కొంత దూరం పెంచాయని అధికార వర్గాలు చర్చించుకుంటున్నాయి. ప్రజాప్రతినిధుల సిఫార్సులకు కొంత ప్రాధాన్యం ఇవ్వాలని కలెక్టరు సూచించినా అంగీకరించకుండా జాయింట్ కలెక్టర్ ఆలేఖలను పక్కన పెట్టినట్లు సమాచారం. నిబంధనలు, అడ్మినిస్ట్రేషన్ గ్రౌండ్స్ కింద బదిలీల పోస్టింగ్‌లు ఇచ్చి ఆఫైలును కలెక్టరుకు పంపారని, దానికి కలెక్టర్ ఆమోదం వేసి పంపారని రెవెన్యూవర్గాలలో తీవ్రచర్చ సాగుతోంది. రెవెన్యూ ఉద్యోగుల సంఘం ప్రాధాన్యం పాయింట్లు, ఉమ్మడి జిల్లాల వారిగా సీనియార్టీని కూడా ఈబదిలీలలో పరిగణలోకి తీసుకోలేదని పలువురు ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈక్రమంలోనే ఇటీవల జరిగిన తహసీల్దార్ల నియామ కాల్లో కొందరిని ఆనియోజకవర్గ ప్రజాప్రతినిధులు వ్యతిరేకించారు. దీంతో 8 మంది తహసీల్దార్లు దాదాపు నెలన్నరపాటు ఎక్కడా జాయిన్‌కాకుండా గాలిలో ఉండాల్సి వచ్చింది. ఆతర్వాత చివరకు వారికి మార్పులు చేసి పోస్టింగ్‌లు ఇవ్వడంతో సమస్య సద్దుమణిగింది. తాజాగా మళ్లీ డీటీలు, ఆర్ఐల బదిలీల వ్యవహారం రగడకు దారితీసింది. ఈపరిస్థితులలో ఎంతమంది జాయిన్ అవుతారో? ఎంతమందిని పెండింగ్‌లో పెడతారో? ఈరచ్చ ఏస్థాయికి వెళుతుందోనన్న ప్రశ్న మొదలైంది.

సోషల్ ఫారెస్ట్ డీఎఫ్ఓగా చంద్రశేఖర్

అనంతపురం న్యూటౌన్, సెప్టెంబరు 22: సోషల్ ఫారెస్ట్ డీఎఫ్ఓగా ఎ.చంద్రశేఖర్‌ను నియమిస్తూ ఆదివారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. నెల్లూరు జిల్లా అటవీశాఖ అధికారిగా ఉన్న అయన్ను అనంతపురం సోషల్ ఫారెస్ట్ డీఎఫ్ఓగా నియమించారు. ఇప్పటి వరకు ఉన్న చంద్రశేఖర్ ఉద్యోగ విరమణ పొందడంతో ఆయన స్థానంలో ఇన్‌చార్జ్ బాధ్యతలు వినీత్ కుమార్‌కు అప్పగించిన విషయం తెలిసిందే. క్లియర్ వెకెన్సీ ఉన్న ఆ స్థానానికి డీఎఫ్ఓగా చంద్రశేఖర్‌ను నియమించారు.

పీఆర్ ఎస్ఈగా జహీర్ అస్లాం

అనంతపురం సిటీ, సెప్టెంబరు 22 : ఉమ్మడి జిల్లా పంచాయతీ రాజ్‌శాఖ ఎస్ఈగా ఎండీ జహీర్ అస్లాం, అనంతపురం పీఆర్ఐ డివిజన్ ఈఈగా జి.ప్రభాకర్‌రెడ్డిని నియమిస్తూ ప్రభుత్వం ఆదివారం రాత్రి ఉత్తర్వులు జారీ చేసింది. ఇదివరకు పీఆర్ ఇన్‌చార్జి ఎస్ఈగా పనిచేస్తున్న కేవీకేవీ ప్రసాద్ పాత స్థానమైన అదే శాఖ పరిధిలోని పీఐయూ ఈఈగా కొనసాగనున్నారు. ఇది వరకు అనంతపురం పీఆర్ఐ డివిజన్ ఈఈగా ఉన్న చంద్రశేఖర్‌ను పార్వతీపురం పీఆర్ఐ డివిజన్‌కు బదిలీ చేశారు. నూతన ఎస్ఈగా నియమితులైన ఎండీ జహీర్ అస్లాం 2019-20లో పీఆర్ఐ అనంతపురం డివిజన్ ఈఈగా పనిచేశారు. ఆ తర్వాత కర్నూలు జిల్లా పీఐయూకు బదిలీ అయ్యారు. అనంతరం జేఎన్‌టీయూలోని ఇంజనీరింగ్ విభాగంలో ఈఈగాగా గత రెండు సంవత్సరాలుగా పనిచేస్తుండగా.. తాజాగా ఈయనకు ఈఈ నుంచి ఎస్ఈగా పదోన్నతి లభించింది. గతంలో ఈయన గతంలో డీఈఈ, జేఈగా కళ్యాణదుర్గం, రాయదుర్గంలో పనిచేశారు. జిల్లాలోని డ్వామాలోని క్యూసీ విభాగంలో అనంతపురం, చిత్తూరు జిల్లాల ఈఈగా పనిచేస్తున్న ప్రభాకర్‌రెడ్డిని తాజాగా పీఆర్ఐ అనంతపురం డివిజన్ ఈఈగా నియమించారు. ఈయన గతంలో కదిరి, కళ్యాణదుర్గం డీఈఈగా పనిచేశారు.

ఆర్అండ్‌బీలో పలువురు ఏఈలు, ఏఈఈలు...

అనంతపురం, సిటి, సెప్టెంబరు 22: రోడ్లు భవనాలశాఖ పరిధిలో పనిచేస్తున్న పలువురు ఏఈలు, ఏఈఈలను బదిలీ చేస్తూ ప్రభుత్వం ఆదివారం రాత్రి ఉత్తర్వులు జారీ చేసింది.

పేరు	ప్రస్తుత స్థానం	బదిలీ స్థానం
డి.పద్మఏకాంబరలక్ష్మి	అనంతపురం సెక్షన్-3	శింగనమల
ఏ. గోవిందరాజులు	కళ్యాణదుర్గం సెక్షన్-1	కణేకల్లు
ఎన్. హారిక	కనగానపల్లి	ధర్మవరం
పి. శ్రీనివాసులు	క్యూసీ-1 అనంతపురం	గోరంట్ల
వై. ధర్మారెడ్డి	ఎన్‌హెచ్ అనంతపురం	రాజంపేట (లక్కిరెడ్డిపల్లి)
జి. సుజాత	శ్రీసత్యసాయి(డీఆర్‌డీఓ)	కర్నూల్ సర్కిల్ ఆఫీస్
జి. నరసింహామూర్తి	శింగనమల	మడకశిర-1
కె. శ్రావణసంధ్య	కళ్యాణదుర్గం-2	అనంతపురం సర్కిల్
ఎం. వన్నూరుస్వామి	పుట్టపర్తి	పుంగనూరు (చిత్తూరు)
ఎల్. సుజాత	కణేకల్లు	ఎన్‌హెచ్. కదిరి
జి. నాగేంద్రప్రసాద్	డి. హీరేహాల్	రాయదుర్గం
ఎస్‌జే ధనలక్ష్మీదేవి	కదిరి ఎన్‌హెచ్	కదిరి
ఎం. నాగేంద్ర	ఎన్‌హెచ్ అనంతపురం	ఎన్‌హెచ్ 234 వీ. కోట
టీ. లక్ష్మీనర్సయ్య	గుత్తి	ఎన్‌హెచ్ ఏటీపీ

ఎన్‌ఫోర్స్‌మెంట్ అసిస్టెంట్ డైరెక్టర్‌గా ఐజయ్య

ధర్మవరం: నియోజకవర్గానికి ప్రత్యేకంగా ఎన్‌ఫోర్స్‌మెంట్ అసిస్టెంట్ డైరెక్టర్‌గా ఐజయ్యను నియమించామని తిరుపతి ఎన్‌ఫోర్స్‌మెంట్ డిప్యూటీ డైరెక్టర్ రాజారావు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఐజయ్య నిరంతరం ధర్మవరం కేంద్రంగా మరమగ్గాలపై తనిఖీలు నిర్వహిస్తారని వెల్లడించారు. పవర్‌లూమ్స్ సమస్యలు, పవర్‌లూమ్స్ రిజర్వేషన్ యాక్టు ఉల్లంఘన గురించి ఐజయ్య ఫోన్‌నెంబర్ 7396034586కు సంప్రదించాలన్నారు.

సీటీఓగా కృష్ణవేణి

హిందూపురం, సెప్టెంబరు 22: హిందూపురం వాణిజ్య పన్నులశాఖ అధికారిగా కృష్ణవేణిని నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇక్కడ పనిచేస్తున్న సీటీఓ గోపీనాథ్‌ను గుంతకల్లుకు బదిలీ చేస్తూ అక్కడ పనిచేస్తున్న కృష్ణవేణిని హిందూపురానికి బదిలీ చేశారు. ఒకటి రెండు రోజుల్లో ఆమె బాధ్యతలు చేపట్టనున్నారు.

'పురం' మున్సిపల్ కమిషనర్‌గా శ్రీనివాసులు

హిందూపురం, సెప్టెంబరు 22: హిందూపురం మున్సిపల్ కమిషనర్‌గా సంఘం శ్రీనివాసులును నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. గతంలో ఈయన మడకశిర కమిషనర్‌గా పనిచేశారు.

జిల్లా గ్రామపంచాయతీ అధికారిగా సమత

పుట్టపర్తిరూరల్, సెప్టెంబరు 22: జిల్లా గ్రామపంచాయతీ ఆఫీసర్‌గా వై సమతను నియమిస్తూ రాష్ట్రప్రభుత్వం ఆదివారం రాత్రి ఉత్తర్వులు జారీచేసింది.

ఘనంగా పరిటాల శ్రీరామ్ పుట్టినరోజు



ధర్మవరం గాంధీనగర్ పార్టీ కార్యాలయం వద్ద కేక్‌కట్ చేస్తున్న టీడీపీ శ్రేణులు

ధర్మవరం, సెప్టెంబరు 22 : ధర్మవరం నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి, రాష్ట్ర అధికార ప్రతినిధి పరిటాల శ్రీరామ్ జన్మదిన వేడుకలను ఆదివారం పట్టణంలో టీడీపీ నాయకులు ఘనంగా నిర్వహించారు. పాండురంగస్వామి ఆలయంలో పరిటాల శ్రీరామ్ పేరిట ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గాంధీనగర్ పార్టీ కార్యాలయంలో కేక్‌కట్ చేశారు. అక్కడి నుంచి ఎన్టీఆర్ సర్కిల్ వరకు ర్యాలీ నిర్వహించారు. అక్కడ ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ప్రభుత్వాస్పత్రిలో రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. మధ్యాహ్నం లక్ష్మీచెన్నకేశవపురం, కదిరిగేటు, ప్రభుత్వాస్పత్రి, ఆర్టీసీ బస్టాండ్ ప్రాంతాల్లో అన్నదానం చేశారు. అదే విధంగా తలారి చంద్రమోహన్‌బాబు, చెన్నూరు లోకేశ్, డిష్ లచ్చి, కాయల రామాంజినేయులు, షాహీర్ శనివారం అర్ధరాత్రి ధర్మవరంలో కేక్‌కట్ పరిటాల శ్రీరామ్ జన్మదిన వేడుకలను నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కమతం కాటమయ్య, పరిశేసుధాకర్, పణికుమార్, పురుషోత్తంగౌడ్, సంధారాఘవ, భీమనేని ప్రసాద్‌నాయుడు, నాగూర్‌హుస్సేన్, రాళ్లపల్లిషరీఫ్, జింకా పురుషోత్తం, మాధవరెడ్డి, శీలామూర్తి, మాధనసుబ్బయ్య, అత్తర్‌రహీం, అస్లాం,ఆజాద్, షామీర్, రావులచెరువు కుళ్లాయప్ప,అబ్రమహేశ్, కొత్తపేట ఆది, గుడిపాటికిశోర్, చీమలరామాంజి, చీమల నాగరాజు, టైలర్ గోపాల్, అంకే నరేశ్, పాలెంతిరుపాల్, కాకర్ల బాషా, సలీంబాష, తిమ్మాపురం మాబుసాబ్, చిలకల ఫకృద్దీన్, సాయికృష్ణ పాల్గొన్నారు.



లక్ష్మీచెన్నకేశవపురంలో అన్నదానం చేస్తున్న టీడీపీ నాయకులు

పలు సేవా కార్యక్రమాలు

పరిటాల శ్రీరామ్ జన్మదినం సందర్భంగా ప్రముఖ పట్టుచీరల వ్యాపార వేత్త, టీడీపీ నాయకుడు సంధా రాఘవ సూచనల మేరకు సంధా రవీంద్ర, టీం సభ్యులు పలు సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించారు. గాంధీనగర్‌లోని అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్‌కు రూ.20 వేలు విలువ చేసే ఫ్రిడ్జ్‌ను అంద జేశారు. గొట్లూరు అనాథాశ్రమానికి రూ.10వేలు అందజేశారు.



అనాథాశ్రమానికి రూ.10వేలు విరాళం అందిస్తున్న సంధా రవీంద్ర, టీంసభ్యులు



అర్బన్ హెల్త్‌సెంటర్‌కు ఫ్రిజ్‌ను అందజేస్తున్న సంధా రాఘవ టీం

తెలుగు యువత ఆధ్వర్యంలో..



గరుడంపల్లిలో కేక్‌కట్ చేస్తున్న టీడీపీ నాయకులు

ధర్మవరంరూరల్ : పట్టణం లోని ఎన్టీఆర్ సర్కిల్‌లో తెలుగు యువత ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. కార్యక్రమంలో తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి గడు పూటి విజయ్‌చౌదరి, తెలుగు యువత నియోజక వర్గ అధ్యక్షు లు సంగాలబాలు, చరణ్‌రాజ్, అశోక్‌వాల్మీకి, తెలుగు యువత నాయకులు తిరుమలేష్, గంగవ రపురవి, నరసింహులు, పవన్ పాల్గొన్నారు.

గరుడంపల్లిలో: మండలంలోని గరుడంపల్లిలో శ్రీరామ్ జన్మదిన వేడుకలను నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు చంద్రశేఖర్, వెంకటేష్, చెలిమి అంజి, చంద్రాయుడు, ఎస్. ఆదినారాయణ, ఏజ్జేపోతలయ్య పాల్గొన్నారు.

గ్రామాల్లోనూ ఘనంగా..: పరిటాల శ్రీరామ్ జన్మదిన వేడుకలను గ్రామగ్రామాల్లోనూ పండుగలా నిర్వహించారు. పలు ఆలయాల్లో పూజలు నిర్వహించి.. కేక్‌లు కట్ చేశారు. అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ పోతుకుంట లక్ష్మన్న, మాజీ కన్వీనర్ గొట్లూరు శ్రీనివాసులు, మాజీ జడ్పీటీసీ మేకల రామాంజినేయులు, తలారి వెంకటలక్ష్మీ, విజయ్‌సారథి, చిగిచెర్ల రాఘవరెడ్డి, సర్పంచ్ ముత్యాలప్ప నాయుడు, పార్థారెడ్డి, ఏలుకుంట్ల ఏగినాటి రమణ, గుత్తాసూరి, మోహురి రామ్మోహన్, గొట్లూరు శివయ్య, జంగం నరసింహులు, అశ్వర్థనాయుడు, తిప్పేపల్లి వెంకటరాముడు, పెద్దచక్కెరయ్య, చిత్రారామ్మోహన్, జయప్రకాష్‌రెడ్డి, బడన్నపల్లి క్రిష్ణ, నేలకోట రామ్మోహన్‌రెడ్డి, నరసింహారెడ్డి, ముచ్చురామిక్రిష్ణ, నిమ్మలకుంట దళవాయి కుళ్లాయప్ప, సీతారంపల్లి తాతిరెడ్డి, పోతులనాగేపల్లి ఆదెప్ప, కత్తేప్రసాద్, రాజశేఖర్‌రెడ్డి, చెలిమినాగానంద, ఏజ్జె చంద్రాయుడు, మల్లేనిపల్లి చంద్ర, బిల్వంపల్లి బాబు, ఓబిలేసు, రవి, వసంతపురం మల్లి ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.



ఎన్టీఆర్ సర్కిల్‌లో స్వీట్లు పంచుతున్న తెలుగు యువత నాయకులు

చీరల పంపిణీ

తాడిమర్రి : పరిటాల శ్రీరామ్ జన్మదినం సందర్భంగా టీడీపీ మండల కన్వీనర్ కూచి రాము, మండల నాయకులు, కార్యకర్తలతో కలిసి కేక్ కట్ చేశారు. కస్తూర్భాగాంధీ పాఠశాలలో విద్యార్థినిలకు స్వీట్లు పంచారు. గంగమ్మ ఆలయం వద్ద ఎన్డీఏ కూటమి నాయకుల ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి స్వీట్లు పంచారు. అదేవిధంగా మహిళలకు చీరలను పంపిణీ చేశారు.



తాడిమర్రిలో చీరలు పంపిణీ చేస్తున్న టీడీపీ నాయకులు



వీవర్సు కాలనీలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కందికుంట



వేళ్లమద్దిలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి

ప్రజాసంక్షేమమే లక్ష్యం

'ఇది మంచి ప్రభుత్వం'లో ఎమ్మెల్యేలు కందికుంట, సింధూరారెడ్డి

నల్లచెరువు, సెప్టెంబరు 22 : పార్టీలకు అతీతంగా అన్ని వర్గాల సంక్షేమమే లక్ష్యం కూటమి ప్రభుత్వ పాలన సాగుతోందని కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ పేర్కొన్నారు. ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఆదివారం మండలంలోని వీవర్సు కాలనీలో ఇంటింటి ప్రచారం చేశారు. వంద రోజుల్లో ప్రభుత్వం అమలు చేసిన పథకాలను, చేపట్టిన అభివృద్ధి పనులను వివరించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శకుంతల, తహసీల్దార్ రవికుమార్, ఏపీఎం రవీంద్ర, సర్పంచ్ పంచరత్నమ్మ, మండల కన్వీనర్ పి. రాజశేఖర్, మాజీ ఎంపీపీ మాబూసాబ్, దాద్దెం శివారెడ్డి, అబ్దుల్‌ఖాదర్, నాగభూషణం నాయుడు, జయరామిరెడ్డి, వెంకటరమణ, అశ్వర్థనాయుడు, ఆంజనప్ప, ప్రభాకర్‌నాయుడు, దేవేంద్రగౌడ్, కిరణ్‌కుమార్ నాయుడు, జీఎం నాగరాజు, నాగిరెడ్డి, బషీర్‌అహమ్మద్, బిజెపి ఇంతియాజ్ అహమ్మద్, పిటీ అంజనేయులు పాల్గొన్నారు.

కదిరి అర్బన్ : మండలంలోని మొటుకుపల్లిలో నిర్వహించిన ఇది మంచి ప్రభ్వుతం కార్యక్రమంలో ఎమ్మెల్యే కందికుంట పాల్గొన్నారు. ఇందులో ఎంపీడీఓ ఆంజనప్ప, ఏపీఎం శారద, కుటమి నాయకులు మోహురిశెట్టి చంద్రశేఖర్, చెన్నకేశవులు, ఉపేంద్రరెడ్డి, రమేష్, చలపతి, చంద్ర, బషీర్, శేషు, సురేష్‌రెడ్డి పాల్గొన్నారు.

నల్లమాడ : మండలంలోని వేళ్లమద్దిలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమాన్ని ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథ్‌రెడ్డి ఆదివారం నిర్వహించారు. వారి పిలుపు మేరకు మండల ప్రజలు వరద బాధితుల కోసం రూ.1.85 లక్షలను విరాళంగా అందజేశారు. విశ్రాంత ఆర్డీవో రామమూర్తి రూ.50వేలు విరాళం అందించారు. కార్యక్రమంలో డీఈఓ మీనాక్షి, సర్పంచ్ బోజేనాయక్, తహసీల్దార్ రంగనాయకులు, ఎంపీడీఓ కొండన్న, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గంగమ్మతల్లికి ప్రత్యేక పూజలు



ధర్మవరంరూరల్, సెప్టెంబరు 22 : మండలంలోని కుణుతూరు గ్రామంలో ఆలయంలో గంగమ్మ తల్లిని ప్రతిష్ఠించి 40 రోజులు అయిన సందర్భంగా ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారికి అభిషేకాలు, కుంకుమార్చన, నైవేద్యం సమర్పించారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం అమ్మవారిని ప్రత్యేక పల్లకిలో గ్రామంలో ఊరేగించారు. ఈ కార్యక్రమంలో ఆలయకమిటీ, గ్రామస్థులు పాల్గొన్నారు.

కుంటెమ్మ ఆలయంలో...

కొత్తచెరువు : మండలంలోని మరకుంటపల్లిలో కుంటెమ్మ దేవి ఆలయాన్ని నిర్మించి వంద రోజులు కావడంతో ఆదివారం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎమ్మెల్యే పల్లె సింధూరా రెడ్డి, మాజీ మంత్రి పల్లెరఘునాథరెడ్డి, కర్ణాటక దేవదాయశాఖ మంత్రి రామలింగారెడ్డి ఈ కార్యక్రమంలో పాల్గొన్న అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.



నృత్యం చేస్తున్న చిన్నారులు

అలరించిన శ్రీసాయికృష్ణ లీలామృతం

పుట్టపర్తి, సెప్టెంబరు 22: బాలవికాస్ చిన్నారులు శ్రీసాయి కృష్ణ లీలామృతం పేరిట భక్తులను అలరింపచేశారు. ఆదివారం సాయంత్రం సాయికుల్వంత్ సభా మండపంలో శ్రీకాకుళం భక్తులు సంగీత సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. బాలవికాస్ చిన్నారులు సంగీత నృత్యంతో భక్తులను తన్మయిలను చేశారు. ఆ జిల్లా భక్తులు వెలుగుతున్న కొవ్వొత్తులతో సత్యసాయి ప్రేమామృతం పేరిట భక్తిగీతాలాపన చేపట్టారు. అనంతరం సత్యసాయి మహాసమాధిని దర్శించుకున్నారు.



వెలుగుతున్న కొవ్వొత్తులతో భక్తులు

సైక్లింగ్‌తో ఆరోగ్యం

ధర్మవరం, సెప్టెంబరు 22: సైకిల్ తొక్కడం వల్ల మంచి ఆరోగ్యం పొందవచ్చని ధర్మవరం ట్రాఫిక్ ఎస్ఐ వెంకటరాముడు పేర్కొన్నారు. ఆదివారం సైక్లింగ్ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో బీఎస్ఆర్ బాలుర ఉన్నత పాఠశాల హెచ్ఎం రాంప్రసాద్, ఆంధ్రప్రదేశ్ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు సభ్యులు, టీసీబీసీ గౌరవాధ్యక్షుడు గోరకాటి పెద్దారెడ్డి, అధ్యక్షుడు బాబాఫకృద్దీన్ పాల్గొన్నారు.



సైక్లింగ్ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ట్రాఫిక్ ఎస్ఐ

ఈ సారీ పంటనష్టమే..!

నంబులపూలకుంట: మండలంలో వేరుశనగ ఎండుముఖం పట్టింది. వర్షాలు రాకపోవడం.. భూగర్భ జలాలు అడుగట్టి పోవడంతో 7,500 ఎకరాలల్లో సాగు చేసిన వేరుశనగ పంట ఎండు దశకు చేరింది. నెలరోజులుగా చినుకు పడలేదు. ఊడలు, పిందెలు వృద్ధి చెందే సమయంలో నీరు లేకపోతే పంటలు ఎండుతున్నాయి. వర్షాధారం కింద సాగుచేసిన వేరుశనగ పూర్తిగా ఎండుముఖం పట్టి.. పశుగ్రాసానికి కూడా పనికి రాకుండా పోతోందని రైతులు వాపోతున్నారు. కనీసం అప్పులకు వడ్డీలు కూడా వచ్చే పరిస్థితి లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అలాగే బోర్లు, బావులలో నీటి మట్టం పడిపోవడంతో సాగుచేసిన పంటలు ఎండిపోతున్నాయి. నూతన బోర్లు వేసినా చుక్క నీరు పడడం లేదు. పంటలు నష్టపోయిన రైతులను ప్రభుత్వమే ఆదుకోవాలని బాధిత రైతులు కోరుతున్నారు.



పడమరనడమిపల్లిలో ఎండిన వేరుశనగ

ఐదేళ్లయినా పట్టించుకోరా..!

విద్యుత్ కేబుల్ కాలిపోయినా స్పందించని అధికారులు



కొత్తచెరువు రైల్వేస్టేషన్ సమీపంలో కాలిపోయిన విద్యుత్ కేబుల్

కొత్తచెరువు, సెప్టెంబరు 22: స్థానిక కొత్తచెరువు రైల్వేస్టేషన్ సమీపంలో వ్యవసాయ బావులకు, బోర్ల మోటార్లకు వెళ్లే విద్యుత్ కేబుల్ కాలిపోయి ఐదేళ్లు అవుతోంది. దీంతో విద్యుత్ సరఫరా కాకపోవడంతో తాము సాగుచేసిన పంటలకు నీరందక ఎండిపోతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఐదు సంవత్సరాల క్రితం కాలిపోయిన విద్యుత్ కేబుల్ వైర్‌ను మార్చాలని పలుమార్లు విద్యుత్‌శాఖ అధికారులకు తెలిపినా ఇప్పటివరకు వారు పట్టించుకోలేదన్నారు. తలమర్ల సబ్‌స్టేషన్ నుంచి కొత్తచెరువు సమీపంలోని వ్యవసాయ పొలాలకు విద్యుత్ సరఫరా అయ్యే విధంగా విద్యుత్ అధికారులు ఏర్పాటు చేశారు. అయితే తలమర్ల నుంచి దాదాపు 10 కిలోమీటర్లు విద్యుత్ సరఫరా అయ్యేసరికి చివర ఉన్న వ్యవసాయ బావులకు, బోర్లకు లో ఓల్టేజ్ సరఫరా అవుతోందని, దీంతో మోటార్లు ఆడక పంటలు ఎండిపోతున్నాయన్నారు. ఒక్కొక్క సమయంలో మోటార్లు కాలిపోతుండటంతో పంటలు ఎండి తీవ్రంగా నష్టపోతున్నామని రైతులు వాపోతున్నారు. ఇప్పటికైన ట్రాన్స్‌కో ఉన్నతాధికారులు స్పందించి విద్యుత్ కేబుల్ వైరు ఏర్పాటు చేసి బావులకు, బోర్లకు నాణ్యమైన విద్యుత్‌ను అందించే విధంగా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

మెగా రక్తదాన శిబిరాలు



బత్తలపల్లిలో రక్తదానం చేస్తున్న వారితో టీడీపీ నాయకులు

ముదిగుబ్బ : స్థానిక బాలికల హైస్కూల్‌లో పరిటాల శ్రీరామ్ జన్మదిన సందర్భంగా మెగా రక్తదాన శిబిరాన్ని మండల క్లస్టర్ ఇన్‌చార్జి తుమ్మల మనోహర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. ఇందులో 75మంది రక్తదానం చేశారు. మెగా రక్తదాన శిబిరం, కేక్ కటింగ్ కార్యక్రమాల్లో టీడీపీ నాయకులు రమేష్ బాబు, కరణం ప్రభాకర్, తుమ్మల మనోహర్, అశ్వర్థ రెడ్డి, కోట్ల బాబి, గోపాల్ రెడ్డి, పతిరెడ్డి, నాగిరెడ్డి, శేఖర్ రాజు, నరసింహ యాదవ్, చికెన్ తిరుపాల్, వినోద్ బాబు, ఆనంద్, మహబూబ్ పీరా, హేమలత, రాధమ్మ, చంద్ర, రామ్మూర్తి, చంద్రసేన, సూరి, నాయుడు, నందా, బీజేపీ సోమల ప్రకాష్ పాల్గొన్నారు. అలాగే పరిటాల శ్రీరామ్ జన్మదిన వేడుకలను మండల టీడీపీ నాయకులు ఆదివారం ఘనంగా నిర్వహించారు. మండల కన్వీనర్ కరణం ప్రభాకర్ ఆధ్వర్యంలో బస్టాండ్ కూడలిలో కేక్ కట్‌చేశారు.

బత్తలపల్లి: పరిటాల శ్రీరాం జన్మదినం సందర్భంగా స్థానిక ఆర్కే కళ్యాణ మండపంలో తెలుగు యువత నాయకులు రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఇందులో 200 మందికి పైగా రక్తదానం చేశారు. మండల నాయకులు 35 కేజీల కేక్ కట్ చేశారు. ఇందులో మండల కన్వీనర్ నారాయణరెడ్డి, నాయకులు చల్లా శ్రీనివాసులు, సంగాల సూరి, బొజ్జి, ఉమాపతి నాయుడు, విశ్వనాశ్ పాల్గొన్నారు.





ముదిగుబ్బలో నిర్వహిస్తున్న మెగా రక్తదాన శిబిరం, బస్టాండ్ కూడలిలో కేక్ కట్ చేస్తున్న టీడీపీ నాయకులు

ప్రైవేటు పాఠశాలల యూనియన్ ఏర్పాటు



అనిల్‌కుమార్‌రెడ్డి, సాయిగీత, జయచంద్రనాయుడు

కదిరి అర్బన్, సెప్టెంబరు 22 : శ్రీసత్యసాయి జిల్లా ప్రైవేటు పాఠశాలల యూనియన్‌ను అనంతపురంలో ఆదివారం జరిగిన సమావేశంలో ఏర్పాటు చేశారు. అధ్యక్షుడిగా అనీల్‌కుమార్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా సాయిగీతా, కోశాధికారిగా జయచంద్రనాయుడు, సీఆర్‌ఓగా రవిచంద్రారెడ్డి, డీసీఈబీ సభ్యుడిగా వేణుగోపాల్, ఉపాధ్యక్షులుగా మమబ్‌బాషా, సివిస్ నాయుడు, జవహర్‌రెడ్డి, చిత్తయ్య, సహాయ కార్యదర్శులుగా నూర్జహాన్, విశేశ్వరరెడ్డి, లక్ష్మీనారాయణ, రామచంద్రారెడ్డి, నాగరాజారెడ్డి, వనజవాణీను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం సభ్యులను సన్మానించారు.

పరిశ్రమల ఏర్పాటుకు కృషి

తనకల్లు, సెప్టెంబరు 22: మల్లిరెడ్డిపల్లి పంచాయతీలో పరిశ్రమల ఏర్పాటుకు కృషి చేస్తానని గవర్నమెంట్ ఆఫ్ ఇండియా మినిస్టరీ ఆఫ్ హోమ్ ఆఫైర్ మెంబరు డాక్టర్ ముక్తియార్ బాషా అన్నారు. ఆదివారం స్వగ్రామమైన మండలంలోని పెద్దపల్లి గ్రామానికి వచ్చిన ఆయన విశ్వశక్తి సంస్థ గురూజీ రాజ్‌కుమార్‌నాయుడుతో మీడియాతో మాట్లాడారు. ఈ ప్రాంత అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేశామని, త్వరలోనే కేంద్రం మంత్రులను సంప్రదిస్తామని అన్నారు. త్వరలోనే విశ్వశక్తి సంస్థ ఆధ్వర్యంలో మండలంలోని వెనుకబడిన గ్రామాల్లో పర్యటించి అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానన్నారు.



మీడియాతో మాట్లాడుతున్న డాక్టర్ ముక్తియార్

క్రైం న్యూస్

ధర్మవరంలో చోరీ

రూ.3.50 లక్షల నగదు, 4.5 తులాల బంగారు నగల అపహరణ



డోర్ లాక్, బీరువాలో లాకర్‌ను పగులకొట్టిన దుండగులు



ధర్మవరం, సెప్టెంబరు 22 : స్థానిక లక్ష్మీచెన్నకేశవపురంలో నివాసముంటున్న బాబు ఇంట్లో శనివారం రాత్రి చోరీ జరిగింది. రూ.3.50 లక్షల నగదు, 4.50 తు లాల బంగారు నగలు చోరీకి గురయ్యాయి. బాబు శనివారం కుటుంబ సభ్యులతో కలిసి పులివెందులలోని భైరవ గుడికి వెళ్లాడు. దుండగులు శనివారం రాత్రి ఆ ఇంటి తాళాలను పగలకొట్టి లోపలికి వెళ్లారు. బీరువాను పగలకొట్టి అందులో ఉన్న రూ. 3.50 లక్షల నగదు, నాలుగున్నర తులాల బంగారు నగలు, ఇన్వర్టర్‌ను చోరీ చేసుకొని వెళ్లారు. ఆదివారం ఉదయం ఈ విషయాన్ని గమనిం చిన స్థాని కులు బాబుకు ఫోన్ చేశారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. బాబు ఫిర్యాదు పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

పట్టపగలే రూ.50 వేలు చోరీ

ధర్మవరంరూరల్ : మండలంలోని తుంపర్తి కాలనీలో ఓ ప్రైవేటు పాఠశాల టీచర్ దేవరపల్లి సంజీవరెడ్డి ఇంట్లో ఆదివారం పట్టపగలే చోరీ జరిగింది. రెండురోజుల క్రితం శుభకార్యం నిమిత్తం కుటుంబసభ్యులతో కలిసి ఆయన బంధువుల ఇంటికి వెళ్లాడు. తిరిగి ఇంటికి వచ్చి చూస్తే ఇంటికి తాళాలు పగలగొట్టడం చూసి ఇంట్లోకి వెళ్లి చూశాడు. ఇంట్లో బీరువాలోని రూ.50వేలు చోరికి గురైనట్లు గుర్తించాడు. బాధితుడు రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

రోడ్డు ప్రమాదంలో తీవ్రగాయాలు

ధర్మవరంరూరల్ : మండలంలోని సీతారంపల్లి క్రాస్ జాతీయ రహదారిపై లారీ ఢీకొనడంతో కనగానపల్లి మండలం చంద్రాచర్ల గ్రామానికి చెందిన నారాయణప్ప ఆదివారం తీవ్రంగా గాయపడ్డాడు. ఆయన బైక్‌లో తన గ్రామం నుంచి ధర్మవరానికి వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. గాయపడ్డ నారాయణప్పను స్థానికులు 108 సాయంతో అనంతపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. రూరల్ పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు ర్యాక్‌ల వితరణ

ధర్మవరం, సెప్టెంబరు 22 : స్థానిక గుట్టకిందపల్లిలోని కెహెచ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 2021-23 సంవత్సరాల మధ్య కాలంలో పనిచేసిన బోధన, బోధనేతర సిబ్బంది రూ. 28 వేల విలువైన ఏడు ఐరన్ ర్యాక్‌లను కళాశాలకు ఆదివారం అందజేశారు. విద్యార్థులకు కావలసిన పుస్తకాలను ఉంచుకోవడానికి ఈ ర్యాక్‌లు ఉపయోగపడతాయని, కళాశాల ప్రిన్సిపల్ ప్రభాకర్‌రెడ్డికి అందజేశామన్నారు.

నవరాత్రి ఉత్సవాలకు విరాళం

ధర్మవరం, సెప్టెంబరు 22 : పట్టణంలోని లక్ష్మీచెన్నకేశవపురంలో త్వరలో జరిగే దేవి నవరాత్రి ఉత్సవాలకు 26వ వార్డు టీడీపీ నాయకుడు టైలర్ గోపాల్ రూ.15 వేలు విరాళాన్ని అందజేశారు. ఆదివారం ఆ డబ్బును నిర్వాహకులకు అందజేశారు.

ఏకగ్రీవంగా కమిటీ ఎన్నిక

ధర్మవరం, సెప్టెంబరు 22: స్థానిక ప్రభుత్వ పాఠశాలలో పనిచేసే స్వచ్ఛ భారత్ కార్మికుల నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు సీఐటీయూ మండల కన్వీనర్ జేవీరమణ తెలిపారు. ఆదివారం స్థానిక సీఐటీయూ కార్యాలయంలో ఈ కమిటిని ఏర్పాటు చేశామన్నారు. అధ్యక్షరాలిగా లక్ష్మీదేవి, కార్యదర్శిగా నాగవేణి, కోశాధికారిగా శ్రీలక్ష్మీ మరో తొమ్మిది మంది సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు చెప్పారు. ఇందులో సీఐటీయూ మండల కో-కన్వీనర్‌లు అయూబ్‌ఖాన్, ఎల్ ఆదినారాయణ పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ జిల్లా ఇన్‌చార్జిగా శ్రీనివాసులురెడ్డి

పుట్టపర్తిరూరల్, సెప్టెంబరు 22 : కాంగ్రెస్ పార్టీ జిల్లా ఇన్‌చార్జిగా పంట శ్రీనివాసులురెడ్డిని నియమిస్తూ ఆదివారం సాయంత్రం ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలారెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో పలువురు పంట శ్రీనివాసులురెడ్డికి శుభాకాంక్షలు తెలిపారు.

ప్రభుత్వ స్థలాన్ని ఖాళీ చేయండి

నల్లచెరువు, సెప్టెంబరు 22 : మండల కేంద్రంలో బాలుర వసతి గృహ భవన నిర్మాణం మధ్యలోనే ఆగిపోయింది. నిరుపయోగంగా ఉన్న ఆ భవనం.. ఖాళీ స్థలాన్ని కొందరు కబ్జా చేసినట్లు తెలుసుకున్న ఎమ్మెల్యే కందికుంట వెంటనే అక్కడి వెళ్లారు. కబ్జాదారులతో మాట్లాడి రెండు గంటల్లో ప్రభుత్వ స్థలాన్ని ఖాళీ చేయాలని, లేకుంటే క్రిమినల్ కేసులు చేస్తామని హెచ్చరించారు. ఆ స్థలాన్ని త్వరగా ఖాళీ చేసేలా చర్యలు తీసుకోవాలని ఆర్డీవో వంశీకృష్ణ, తహసీల్దార్ రవికుమార్‌ను ఆదేశించారు.

అనారోగ్యంతో మాజీ ఎంపీటీసీ మృతి



నారాయణ (ఫైల్)

తనకల్లు : మండలంలోనీ చీకటిమానుపల్లి టీడీపీ నేత, మాజీ ఎంపీటీసీ పి.నారాయణ (52) ఆదివారం అనారోగ్యంతో మరణించాడు. ఆయన కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. గురువారం స్వగ్రామమైన టి.కుంట్లపల్లికి తరలిం చారు. అక్కడ చికిత్సలు పొందుతూ మరణించాడు. నారాయణ గతంలో జనజాగృతి స్వచ్ఛంద సేవాసంస్థ, దళిత సంఘం, బీజేపీ, టీడీపీలో పనిచేశారు. తనకల్లు నుంచి బంధువులు, స్నేహితులు పెద్ద సంఖ్యలో టి.కుంట్లపల్లికి వెళ్లి ఆయన మృతదేశానికి నివాళులర్పించారు. సోమవారం అంత్యక్రియలు నిర్వహిస్తారు. నారాయణకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

సిద్దేశ్వరస్వామికి పూజలు



మడకశిర(అమరాపురం), సెప్టెంబరు 22 : అమరాపురం మండలంలోని హేమావతి హెంజేరు సిద్దేశ్వరస్వామికి ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వారికి ప్రత్యేక అలంకరణ చేసి వివిధ అభిషేకాలు, కుంకుమార్చన, రుద్రాభిషేకం, తైలాభిషేకం, పంచామృతాభిషేకం కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు. స్వామివారి ఆలయ ప్రాంగణంలో ఉన్న శ్రీకాలభైరవేశ్వర, దొడ్డేశ్వర, మల్లేశ్వరస్వామి, విరుపాక్షిస్వామి దేవాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు ఆలయ ప్రధాన అర్చకులు శివకుమార్ స్వామి, సిద్దలింగేశ్వర, మహేష్‌కుమార్‌స్వామి, గౌతమ్, ప్రదీప్ తెలిపారు. ఈ ప్రాంతం భక్తులేకాక ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు తదితర ప్రాంతాలకు చెందిన భక్తులు పాల్గొన్నారు.

ఉత్సవాలను ఘనంగా నిర్వహిద్దాం

లేపాక్షి, సెప్టెంబరు 22: ప్రపంచ ప్రసిద్ధిగాంచిన లేపాక్షి దుర్గా, వీరభద్రస్వామి ఆలయంలో దసరా శరన్నవరాత్రి వేడుకలను ఘనంగా నిర్వహిద్దామని ఆలయ కమిటీ ఛైర్మన్ రమానందన్‌స్వామి తెలిపారు. ఆదివారం దుర్గా వీరభద్రస్వామి ఆలయంలో గ్రామ పెద్దలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దసరా వేడుకలను ఘనంగా నిర్వహించాలని, ప్రతిరోజూ అమ్మవారిని వివిధ రకాలుగా అలంకరించి అభిషేకాలు, అర్చనలు నిర్వహించాలన్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ జయప్ప, ఈఓ నరసింహమూర్తి, గ్రామస్థులు పాల్గొన్నారు.

దరఖాస్తు చేసుకోండి

పెనుకొండ, సెప్టెంబరు 22 : తపాలాశాఖలో భాగమైన తపాలా జీవితబీమా, గ్రామీణ తపాలా జీవిత బీమా ఏజెంట్లుగా శ్రీసత్యసాయి జిల్లా హిందూపురం డివిజన్‌లో పనిచేయడానికి ఆసక్తికలవారు ఈనెల 23 నుంచి 27లోగా దరఖాస్తులు చేసుకోవాలని సూపరింటెండెంట్ విజయ్‌కుమార్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు 18 ఏళ్లనుంచి 50సంవత్సరాలు వయసు కలిగి, పదో తరగతి పాసై ఉండాలన్నారు. అభ్యర్థులు ఎస్ఎస్‌సీ, ఆధార్, పాన్‌కార్డు, రెండు ఫొటోలతో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఎంపికయిన ఏజెంట్లు సెక్యూరిటీ డిపాజిట్ కింద రూ.5వేలు చెల్లించాలన్నారు. మరిన్ని వివరాలకు 9441823899, 8520099939కు సంప్రదించాలన్నారు.

జూదరుల అరెస్ట్

లేపాక్షి, సెప్టెంబరు 22 : మండలంలోని వీబూతిపల్లి గ్రామ శివార్లలో పేకాట ఆడుతున్నారన్న సమాచారంతో ఆదివారం పోలీసులు దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో తొమ్మిది మందిని అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ.11,500 నగదు, ఆరు ద్విచక్ర వాహనాలు, ఆరు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదుచేసి కోర్టులో హాజరుపరుస్తున్నట్లు ఏఎ్‌సఐ షర్ఫుద్దీన్ తెలిపారు.

మద్యానికి బానిసై కర్ణాటకవాసి మృతి



వెంకటరమణప్ప మృతదేహం

హిందూపురం, సెప్టెంబరు 22 : మద్యానికి బానిసై కర్ణాటకకు చెందిన వ్యక్తి హిందూపురంలోని చౌళూరులో ఆదివారం మృతి చెందాడు. సీఐ ఆంజనేయులు తెలిపిన వివరాల మేరకు.. గౌరీబిదనూరు తాలూకా కుర్లపల్లికి చెందిన వెంకటరవణప్ప(66) అనే వ్యక్తి 15 ఏళ్లుగా తాగుడుకు బానిసై బయట ప్రాంతాల్లోనే ఉండేవాడు. భార్య మృతిచెందడంతో ఇంట్లో అసలు ఉండేవాడు కాదన్నాడు. ఐదేళ్ల క్రితం ఇంటి నుంచి వెళ్లిపోయాడు. ఆదివారం ఉదయం చౌళూరు పాఠశాల ఆవరణంలో మృతదేహం పడి ఉంది. స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఇతను కొద్దిరోజులుగా కల్లు సేవించడానికి చౌళూరుకు వస్తుండేవాడని స్థానికులు చెప్పినట్లు సీఐ తెలిపారు. మృతుని కుమారుడు గంగరాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మృతదేహాన్ని శవపంచనామా నిమిత్తం హిందూపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తున్నట్లు తెలిపారు.

ఎమ్మార్పీఎస్ గ్రామ కమిటీల ఏర్పాటు

మడకశిర రూరల్, సెప్టెంబరు 22 : మండలంలో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో నూతన గ్రామ కమిటీలను ఏర్పాటు చేసినట్లు జిల్లా గౌరవ ఉపాధ్యక్షుడు నరసంహులు తెలిపారు. ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకుడు సాగర్ ఆధ్వర్యంలో ఆదివారం మండలంలో మణూరు, మెళవాయి పంచాయితీలలో గ్రామ కమిటీలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అనంతరం సాగర్, నరసంహులును కమిటీ సభ్యులు సన్మానించారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ గోవిందప్ప, చౌడప్ప తదితరులు పాల్గొన్నారు.

108 ఢీకొని వృద్ధుడి మృతి

లేపాక్షి, సెప్టెంబరు 22 : మండల పరిధిలోని గొంగటిపల్లి వద్ద 108 వాహనం ఢీకొని వృద్ధుడు మృతిచెందిన సంఘటన ఆదివారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. గొంగటిపల్లికి చెందిన అశ్వర్థప్ప(75) ఆదివారం తెల్లవారుజామున వాకింగ్ వెళ్తున్నాడు. అదే సమయంలో హిందూపురం-చిలమత్తూరుకు వెళ్తున్న 108వాహనం అశ్వర్థప్పను ఢీకొంది. గాయాలపాలై కిందపడిన అతన్ని హిందూపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతిచెందినట్లు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ షర్ఫుద్దీన్ తెలిపారు.

విశేష స్పందన

పెనుకొండ, సెప్టెంబరు 22 : పట్టణంలోని ఘనగిరి పాఠశాలలో జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన మూర్ఛవ్యాధి చికిత్స శిబిరానికి విశేష స్పందన లభించింది. ఆదివారం నిర్వహించిన ఈ శిబిరంలో 31 మంది వ్యాధిగ్రస్థులకు డాక్టర్ రోహిల్ చికిత్సలు అందించారు. కార్యక్రమంలో జేవీవీ జిల్లా కార్యదర్శి హరి, జోన్ అధ్యక్షుడు నబీ, ప్రధాన కార్యదర్శి ఇమ్రాన్, సభ్యులు రాజశేఖర్, రమేష్, కోగిర జయచంద్ర, పాఠశాల కరస్పాండెంట్ ఇలియాజ్, బాబా, యశ్వంత్, బాబు, క్రిష్ణమూర్తి పాల్గొన్నారు. నవంబరు 24న శిబిరాన్ని మళ్లీ నిర్వహిస్తామని నిర్వాహకులు తెలిపారు.

రైతులకు చెక్కుల పంపిణీ



రైతులకు చెక్కును పంపిణీ చేస్తున్న మంత్రి సవిత



సీసీరోడ్డును ప్రారంభిస్తున్న మంత్రి

పెనుకొండ టౌన్, సెప్టెంబరు 22 : ఏపీఐఐసీ ద్వారా మల్టీమాడల్ లాజిస్టిక్ పార్కు కోసం భూములిచ్చిన రైతులకు బీసీ సంక్షేమ, చేనేత, జౌళిశాఖల మంత్రి సవిత చెక్కులను పంపిణీ చేశారు. ఆదివారం సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పెనుకొండ మండలంలోని గొందిపల్లిలో 204ఎకరాల భూమిని 62 మంది రైతులు పార్కు నిర్మాణం కోసం భూములిచ్చారని తెలిపారు. ప్రస్తుతం 21మంది రైతులకు రూ.10.72కోట్లు అందించినట్లు చెప్పారు. పెనుకొండ ప్రాంత రైతులు చంద్రబాబు మీద నమ్మకం ఉంచి భూములు ఇవ్వడంతో ఈ ప్రాంత రూపు రేఖలు మారాయన్నారు. అప్పట్లో తక్కువ ధరకు భూములు ఇవ్వడంతోనే కియా కార్లపరిశ్రమ, దాని అనుబంధ పరిశ్రమలు వచ్చాయన్నారు. కార్యక్రమంలో ఆర్డీఓ వెంకటశివరాంరెడ్డి, ఏపీఐఐసీ జడ్ఎం సోని, టీడీపీ జిల్లా అధ్యక్షులు కొల్లకుంట అంజినప్ప, అరుణ్‌రెడ్డి, సోము, తదితరులు పాల్గొన్నారు.

సీసీరోడ్డును ప్రారంభించిన మంత్రి

గోరంట్ల: పట్టణంలోని శివాలయం కాలనీలో రూ.2.30లక్షల వ్యయంతో నిర్మించిన సీసీ రోడ్డును ఆదివారం బీసీ సంక్షేమ, చేనేత, జౌళి శాఖల మంత్రి సవిత ప్రారంభించారు. టీడీపీ అభిమాని మేస్త్రీ ముద్దల వెంకటరాముడు ఎన్నికల సమయంలో సీసీ రోడ్డు సొంత ఖర్చుతో వేయిస్తామని హామీ ఇచ్చారు. పార్టీ విజయంతో ఆ మాట ప్రకారం గత నెలలో మంత్రిచే భూమి పూజ చేసి.. పూర్తి చేసి ప్రారంభింపచేశారు. ఈ సందర్భంగా మంత్రి ద్విచక్ర వాహనాన్ని నడిపి రోడ్డును పరిశీలించారు. ఇచ్చిన మాట నిలుపుకున్న వెంకటరాముడు, గంగరత్న దంపతులను మంత్రి అభినందించి, సన్మానించారు. వీరిని ఆదర్శంగా తీసుకోవాలని, ఇలా మీ ప్రాంతాభివృద్ధికోసం ముందుకురావాలని పిలుపునిచ్చారు. అనంతరం పట్టణంలో వందరోజుల పాలనలో చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను మంత్రి వివరించారు. ఇది మంచి ప్రభుత్వ కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో కూటమి నాయకులు సోముశేఖర్, సంతోష్, జయచంద్ర, మనోహర్, అజంతుల్లా, గిరి, ఉమ్మర్‌ఖాన్, సుధాకర్‌రెడ్డి, నరేష్, వెంకటరెడ్డి, రాజారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైద్య శిబిరానికి విశేష స్పందన

గోరంట్ల పట్టణంలోని శ్రీవాసవి మహల్‌లో ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు బలరాం గుప్త ఆధ్వర్యంలో ఆదివారం ఏర్పాటు చేసిన ఉచిత మెగా వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. శిబిరంలో 552 మంది వైద్యచికిత్సలు పొందారు. శిబిరాన్ని బీసీ సంక్షేమ, చేనేత, జౌళి శాఖల మంత్రి సవిత ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బలరాంగుప్త కుటుంబ సభ్యులు బెంగళూరు ఆస్టర్ ఆర్‌వీ ఆసుపత్రి వైద్యులచే ఉచిత శిబిరం ఏర్పాటు చేయడం అభినందనీయని తెలిపారు. వెనుకబడిన ప్రాంతంలో అత్యున్నత వైద్యులచే చికిత్సలు చేయించడం శుభపరిణాం అన్నారు. వైద్యశిబిరంలో ఆస్టర్ ఆర్వీ ఆసుపత్రి నుంచి వైద్యులు శ్రీనివాసులు, శ్యామ్‌సుందర్, లోకనాథ్ తదితరులు పాల్గొన్నారు. 30మందికి వివిధ రకాల శస్త్రచికిత్సలు అవసరమని వైద్యులు నిర్ధారించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం నాయకులు శివప్రకాష్, వెంకటేశ్వర్లు, నందగోపాల్, శ్రీనివాసులు, మణికంఠ, హరినాథ్‌గుప్త, గౌరీ శంకర్ పాల్గొన్నారు.



యర్రగుంట చెక్ డ్యామ్‌లో ఏర్పాటు చేసిన లేఅవుట్



పరిగిలో లేఅవుట్ కోసం చెక్‌డ్యాంను పూడ్చేసిన దృశ్యం

కబ్జాలతో నిండిన చెక్ డ్యామ్‌లు

హిందూపురం(పరిగి), సెప్టెంబరు 22 : రైతులకు ఉపయోగ పడాల్సిన చెక్‌డ్యాంలు కబ్జాదారుల కబంధ హస్తాల్లో చిక్కుకున్నాయి. పరిగి మండల పరిధిలోని 103 సర్వే నంబరు, యర్రగుంట పంచాయతీలో 106సర్వే నంబరులో చెక్‌డ్యామ్‌లను కూల్చి కబ్జాచేసిన సంఘటన వెలుగులోకి వచ్చింది. స్థానిక రైతులు తెలిపిన మేరకు.. సుమారు 40ఏళ్ల పైబడి పశువులు నీటిని తాగడానికి, పంట పొలాల్లో నీటి శాతం పెరగడానికి, వర్షంతో నిండిన డ్యామ్‌ల ద్వారా కాలువ అనుసంధానంతో దిగువ ఉన్న పంట పొలాలకు నీరందేది. అలా వెళ్లిన కాలువ నీరు యర్రగుంట చెరువులో కలిసేది. ప్రస్తుతం అక్రమదారులు ఎక్కువ కావడంతో డ్యామ్‌లను సైతం కూల్చివేసి లేఅవుట్లను నిర్మించారు. వర్షంతో వచ్చిన నీరు అక్కడే ఆవిరై పోతున్నాయి.

పలుమార్లు తహసీల్దార్ కార్యాలయంలో యర్రగుంటవాసులు వినతి పత్రాలు అందించినా ప్రయోజనం లేకుండా పోయింది. అక్రమణదారులపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. చెక్‌డ్యామ్‌లో నిర్మించిన లేఅవుట్లను సర్వే చేయించి కాలువ మరమ్మతులు చేయాలని స్థానిక రైతులు కోరుతున్నారు.



7వ వార్డులో కల్వర్టులు లేని కాలువలు



కల్వర్టుపై రంధ్రాన్ని బండరాళ్లతో పూడ్చిన దృశ్యం

కాలువలు సరే.. కల్వర్టులు ఏవీ..?

ప్రజల అవస్థలను పట్టించుకోని అధికారులు

పెనుకొండ, సెప్టెంబరు 22 : పట్టణంలోని కొన్ని వార్డుల్లో కొత్తగా రోడ్లు నిర్మించి వాటిపై కల్వర్టులు నిర్మించకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పట్టణంలోని 7వ వార్డులో గత సంవత్సరం డిసెంబర్‌లో కొత్తగా సీసీరోడ్లు, కాలువలు నిర్మించారు. రోడ్లు దాటడానికి కాలువలపై కల్వర్టులను ఇప్పటి వరకు నిర్మించకపోవడంతో ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. 14వ వార్డులో సాయిబాబా గుడివద్ద కాలువలు శుభ్రం చేయడానికి కల్వర్టుల మధ్య రంధ్రాలు చేసి వాటిపై బండరాళ్లను మూసివేయడంతో పిల్లలు, వృద్ధులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వీటి కారణంగా రాత్రివేళల్లో ప్రమాదాలకు గురవుతున్నారు. ఈ వీధుల్లోకి ఆటోలు రావడానికి భయపడుతుంటారు. కొత్తగా వచ్చిన కమిషనర్ వీటిపై దృష్టి ఉంచి సమస్య పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

సమస్యల వలయంలో గురుకుల విద్యార్థినులు

- బోధన గదుల్లోనే పడక
- ఆరు గదుల్లోనే బోధన
- ప్రధాన సబ్జెక్టులకు ఉపాధ్యాయులు కరువు
- ఇబ్బందులు పడుతున్న విద్యార్థినులు
- పట్టించుకోని పాలకులు



ఒకేచోట విద్యార్థినుల సామగ్రి



గదుల్లోకి వెళుతున్న కోతులు

పెనుకొండ టౌన్, సెప్టెంబరు 22 : సంక్షేమ హాస్టళ్లు అంటేనే సంక్షోభానికి చిరునామాగా మారాయి. కనీస సౌకర్యాలు లేకుండానే వసతి గృహాల్లో విద్యార్థినులు తీవ్రంగా అవస్థలు పడాల్సి వస్తోంది. కనీస వసతులు కూడా లేని దీన స్థితిలో పెనుకొండలో ఉన్న బాలికల గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాల విద్యార్థినులు చదువుకోవాల్సి వస్తోంది. పాలకుల నిర్లక్ష్యానికి గిరిజన హాస్టళ్ల నిలయంగా మారాయి. అక్కడే ఆశ్రయం పొందుతూ చదువు కొనసాగుతున్న విద్యార్థినుల పరిస్థితి ఆగమ్యగోచరంగా మారింది. బాలికల గురుకుల గిరిజన సంక్షేమ పాఠశాలలో 3 నుంచి 10వ తరగతి వరకు 154 మంది విద్యార్థినులు ఉన్నారు. స్వగ్రామానికి దూరంగా ఉంటూ ఎస్టీ వర్గానికి చెందిన విద్యార్థినులు సంక్షేమ వసతి గృహాల్లో ఆశ్రయం పొందుతూ చదువు కొనసాగిస్తున్నారు. అరకొర సౌకర్యాలున్న హాస్టల్లో చిక్కుకుపోయి విలవిలలాడుతున్నారు. పాలకులు వసతిగృహాల పరిస్థితిని గాలికి వదిలేశారు. 154 మంది విద్యార్థినులు ఉన్న హాస్టల్లో ఎనిమిది గదులున్నాయి. ఒక గదిలో ప్రిన్సిపాల్ చాంబర్, మరొకటి స్టోర్‌రూమ్, మిగిలిన ఆరు గదుల్లోనే 154 మందికి బోధన చేయాల్సి ఉంటుంది. సంక్షేమ హాస్టల్లో బోధన గదులు, రాత్రివేళల్లో పడకగదులు విడివిడిగా ఉండాలి. ఇక్కడ ఉన్నతాధికారులు, పాలకులు నిర్లక్ష్యానికి బోధన గదులే రాత్రివేళల్లో పడకగదులుగా వాడుకోవాల్సి వస్తోంది. అంతమంది ఒకే చోట పడుకోవాల్సి రావడంతో వివిధ అనారోగ్యాలు తలెత్తుతున్నాయని విద్యార్థినులు వాపోతున్నారు.



అధ్వానంగా ఉన్న పరిసరాలు

ఉపాధ్యాయుల కొరత : అనూబాయి, విద్యార్థిని



పదో తరగతి పునఃప్రారంభించినప్పటి నుంచి ప్రధాన సబ్జెక్టులైన ఇంగ్లీష్, లెక్కల ఉపాధ్యాయులు లేరు. ఒకసారి ఇటువైపు పాలకులు వస్తే మా సమస్యలు చెప్పుకుంటాం.

ఇరుకు గదుల్లో ఇబ్బందులు: అక్షయ, విద్యార్థిని



ఇరుకు గదుల్లో విద్యాబోధన ఇబ్బందిగా మారింది. రేకుల షెడ్లలో అందరం లగేజీ ఉంచి రాత్రి సమయాల్లో బోధన గదుల్లో నిద్రపోవాల్సి వస్తోంది. చాలా ఇబ్బందులున్నాయి. నూతన భవనం నిర్మించాలి. కాంపౌండ్‌వాల్ పూర్తిగా దెబ్బతింది.

భవన నిర్మాణానికి నివేదిక ఇచ్చాం



హాస్టల్ అదనపు గదుల నిర్మాణానికి ప్రభుత్వానికి నివేదించాం. నిర్మాణంలో ఉన్న మెడికల్ కళాశాల ఎదురుగా ప్రభుత్వం ఆరు ఎకరాలు సేకరించింది. అందులో నిర్మాణం చేపట్టాల్సి ఉంది. విద్యార్థినుల సంఖ్య పెరిగింది.

- విజయ్‌కుమార్, ప్రిన్సిపాల్

మడకశిర అభివృద్ధే ధ్యేయం: ఎమ్మెల్యే



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఎంఎస్ రాజు

అగళి, సెప్టెంబరు 22: మడకశిర నియోజకవర్గ అభివృద్ధే తన ధ్యేయమని ఎమ్మెల్యే ఎంఎస్ రాజు పేర్కొన్నారు. అగళి మండలం కోడిపల్లిలో ఆదివారం 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమాన్ని నిర్వహించారు. సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారాచంద్రబాబునాయుడు సంపద సృష్టించి రాష్ట్ర అభివృద్ధికి కృషి చేస్తున్నారని తెలిపారు. ఐదు సంవత్సరాల్లో ప్రతి గ్రామానికి తారు, సిమెంటు రోడ్లు వేయిస్తామన్నారు. మహిళలకు దీపావళి నుంచి ఉచిత గ్యాస్ పంపిణీ చేస్తామన్నారు. మడకశిర నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తానని అన్నారు. తిరుపతి వెంకన్ననే మాజీముఖ్యమంత్రి జగన్‌రెడ్డి వదల్లేదని ఎద్దేవ చేశారు. అనంతరం మహిళా సంఘాలకు శ్రీనిధి కింద రూ.38లక్షలు, ఉన్నతిలో రూ.22లక్షలు చెక్కులను పంపిణీ చేశారు. స్థానిక సర్పంచ్ నరసింహమూర్తి కోడిపల్లి పంచాయతీని అన్ని విధాలా అభివృద్ధి చేయాలని సూచించడంతో వెంటనే స్పందించి తన ఒక నెల జీతం తాగునీటి కోసం అందజేస్తున్నానని, మిగతా అభివృద్ధి కార్యక్రమాలు చేస్తానని హామీ ఇచ్చారు. హూలపల్లిలో ఏర్పాటు చేసిన ఎన్టీఆర్ సుజల స్రవంతి పథకాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ శ్రీనివాసమూర్తి, జడ్పీటీసీ సభ్యుడు ఉమేష్, ఎంపీడీఓ రవిప్రసాద్, ఇన్‌చార్జ్ తహసీల్దార్ సుబ్బారావు, ఏరియా కోఆర్డినేటర్ నాగరాజు, ఏపీఎం సురేష్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లీలావతి, సర్పంచ్ నరసింహమూర్తి, నాయకులు కుమారస్వామి, శివకుమార్, రమేష్, పాండురంగప్ప, చంద్రప్ప, జయప్ప, కృష్ణమూర్తి, శ్రీనివాస్, రాజగోపాల్ తదిరులు పాల్గొన్నారు.

ఆసుపత్రిని అన్నివిధాలా అభివృద్ధి చేస్తా

అగళి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని అన్నివిధాలా అభివృద్ధి చేస్తానని మడకశిర ఎమ్మెల్యే ఎంఎస్ రాజు పేర్కొన్నారు. ఆదివారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఏర్పాటు చేసిన భూమి పూజ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రూ.40లక్షలతో అదనపు గదులు నిర్మించి రోగులకు బెడ్లు కూడా ఏర్పాటు చేస్తామన్నారు. అనంతరం వైద్య సిబ్బందితో సమావేశం నిర్వహించి ఆసుపత్రికి కావాల్సిన వసతులుపై ఆరాతీశారు.

ఘనంగా కేజీబీవీ వార్షికోత్సవం

రొళ్ల: మండలంలోని ఆవినకుంట కస్తూర్బా పాఠశాలలో 15వ వార్షికోత్సవం కార్యక్రమాన్ని ఎస్ఓ మునవర్‌జాన్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే ఎంఎస్ రాజు పాల్గొని చిన్నారులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలను ఆస్వాదించారు. విద్యార్థులు విద్యతోపాటు అన్ని రంగాల్లో పురోగతి సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కన్వీనర్ దాసిరెడ్డి, ప్రధాన కార్యదర్శి ఈరన్న, ఎంపీపీ కవిత, జడ్పీటీసీ నన్నతిమ్మప్ప, రామకృష్ణ, గురుమూర్తి, స్కూల్ కమిటీ ఛైర్మన్‌లు, వైస్‌ఛైర్మన్‌లు, పిల్లల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

మడకశిర బ్రాంచ్ కెనాల్‌కు నీరివ్వండి

మడకశిరటౌన్, సెప్టెంబరు 22 : గొల్లపల్లి రిజర్వాయర్ నుంచి మడకశిర బ్రాంచ్ కెనాల్‌కు నేరుగా నీరు అందించాలని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడును కోరినట్లు జల సాధన సమితి జిల్లా అధ్యక్షుడు ఆర్.రామకుమార్, ప్రధాన కార్యదర్శి చైతన్య గంగిరెడ్డి, నాయకులు సోమకుమార్ తెలిపారు. ఈ మేరకు ఆదివారం అనంతపురంలో జల సాధన సమితి ఆధ్వర్యంలో మంత్రికి వినతి పత్రం అందించినట్లు వారు చెప్పారు. పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. హంద్రీనీవా కాలువ వెడల్పు చేయాలని, దీనికి సమాంతర కాలువ నిర్మించాలని, మడకశిర బ్రాంచి కెనాల్ వెడల్పు చేయాలని, నియోజకవర్గంలోని 265 చెరువులకు నీరు నింపాలని కోరినట్లు తెలిపారు. హంద్రీనీవా ప్రాజెక్టుకు పిల్లకాలువలు తవ్వి 3.45 లక్షల ఎకరాల ఆయకట్టుకు నీరందించేందుకు కృషి చేయాలని కోరినట్లు తెలిపారు. మడకశిర ప్రాంతంలో రాళ్లపల్లి, రత్నగిరి రిజర్వాయర్ నిర్మాణాలను పూర్తి చేయాలని, హంద్రీనీవా 57, 58 ప్యాకేజీలను పూర్తిచేసి అన్ని చెరువులకు నీరు అందించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. మంత్రి సానుకూలంగా స్పందించారని వారు తెలిపారు. ఈ సందర్భంగా నియోజకవర్గ జల సాధన సమితి సంఘం నాయకులు పాల్గొన్నారు.

హోరాహోరీగా ఫుట్‌బాల్ పోటీలు



పోటీలో పాల్గొన్న మడకశిర ఫుట్‌బాల్ ఆటగాళ్లు

మడకశిరటౌన్, సెప్టెంబరు 22: మడకశిర ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణంలో ఆర్డీటీ సహకారంతో నిర్వహించిన ఫుట్‌బాల్ పోటీలు హోరాహోరీగా సాగాయి. ఆదివారం మడకశిర ఫుట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మొదటిగా హిందూపురం, మడకశిర జట్లు తలపడ్డాయి. ఇరుజట్లు సమానంగా గోల్ చేయగా అనంతరం మడకశిర, పరిగి జట్లు తలపడ్డాయి. రెండు జట్లు గోల్ సమానంగా సాధించాయి. దీంతో మ్యాచ్‌లు టైగా నిలిచాయి. ఫుడ్ అసోసియేషన్ సభ్యులు నవీద్, బాలాజీ, జగదీష్, తదితరులు ఉన్నారు.



ఆక్రమణకు గురైన పంచాయతీ బోరుబావి ఇదే..

పంచాయతీ బోరుబావి ఆక్రమణ

పట్టించుకోని నగర పంచాయతీ అధికారులు

పెనుకొండ రూరల్, సెప్టెంబరు 22 : పెనుకొండ నగర పంచాయతీలోని మడకశిర-కోనాపురం వెళ్లే దారిలో పంచాయతీ బోరుబావి ఆక్రమణకు గురైంది. 30 ఏళ్ల క్రితం కోనాపురం రహదారి పక్కన పంచాయతీ అధికారులు బోరుబావిని తవ్వి పట్టణానికి తాగునీటిని అందించేవారు. గతంలో బోరుబావి పక్కన సత్రం కూడా ఉండేది. పెనుకొండలో భూముల విలువ అమాంతంగా పెరిగిపోవడంతో రోడ్డు ఆక్రమణకు గురయింది. గత కొన్ని నెలల నుంచి కోనాపురం వెళ్లే రహదారి వివాదాస్పదంగా మారింది. కోనాపురం వెళ్లే దారి పక్కన 30 ఏళ్ల క్రితం వేసిన తాగునీటి బోరుబావి ఆక్రమణకు గురైంది. ఈ క్రమంలో రహదారి పక్కన కొనుగోలు చేసిన భూ యజమానులు వాటి స్థలానికి ముళ్లకంచె వేశారు. ఈ ముళ్లకంచెలోనే పంచాయతీ బోరు ఉంది. ఇప్పటికైనా నగర పంచాయతీ అధికారులు స్పందించి పంచాయతీ బోరుబావి ఆక్రమణకు గురికాకుండా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. ఈ విషయంపై నగర పంచాయతీ కమిషనర్ శ్రీనివాసులును వివరణ కోరడానికి ప్రయత్నించగా.. ఆయన ఫోన్ తీయడం లేదు.